


## నేడు పాఠశాలలకు సెలవు

**నంద్యాల (కల్చరల్), సెప్టెంబరు 1:** భారీ వర్షాల కారణంగా సోమవారం జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలకు సోమవారం సెలవు దినంగా ప్రకటిస్తున్నట్లు కలెక్టర్ జి.రాజకుమారి ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా ప్రభుత్వం సెలవు ప్రకటించిందన్నారు. ఆయా పాఠశాలలు, కళాశాల ప్రిన్సిపాల్స్‌కు ముందస్తు సమాచారం ఇచ్చి తగు చర్యలు తీసుకోవాలని డీఈవో, డీవీఈవోలకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.

# కుండపోత


వెలుగోడు మండలంలో మునిగిన పంట చేలు

- మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలు
- పొంగి పొర్లుతున్న వాగులు, వంకలు
- నీట మునిగిన పంట పొలాలు

నంద్యాల, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి)/ఆత్మకూరు: బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో రెండ్రోజులుగా కురుస్తున్న వర్షాలతో జిల్లాలోని పలు వాగులు, వంకలు పొంగిపొర్లాయి. ఏకధాటిగా పడుతున్న వానలతో ఆత్మకూరు పట్టణంలో, నల్లమల అటవీ ప్రాంతాల్లో చెట్లు కూలి రోడ్లపైన పడిపోయాయి. దీంతో ఆ ప్రాంతాల్లో రాకపోకలకు అంతరాయం కలిగింది. జిల్లా వ్యాప్తంగా ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం 5 గంటల వరకు కురిసిన వర్షపాతాన్ని పరిశీలిస్తే కొత్తపల్లి మండలంలో అత్యధికంగా 26.8 మి.మీ. నమోదైంది. అత్యల్పంగా బేతంచర్లలో 1.2 మి.మీ. వర్షం కురిసింది.

### స్తంభించిన జన జీవనం..

కుందూ నది ఉధృతంగా ప్రవహిస్తోంది. నంద్యాల శివారులోని దళితవాడ, భీమవరం వెళ్లే దారిలో ఉన్న మద్దిలేరు వాగు ఉప్పొంగి ప్రవహించింది. పాములపాడు మండలంలో వాగులు, వంకలు ఉప్పొంగి సమీప గ్రామాల్లోకి వర్షపు నీరు చేరింది. పాములపాడు, చెలిమిళ్ల మధ్యలోని భవనాశి, ఎద్దులవంక వాగులు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో రాకపోకలకు ఆటంకం ఏర్పడింది. బండిఆత్మకూరు మండలంలోని మద్దిలేరు వాగు, జుర్రాగు, రాళ్ల వాగు, రాధావంక, జళ్ల వాగులు పొంగిపొర్లి ప్రవహిస్తున్నాయి. దీంతో బండిఆత్మకూరు, శింగవరం, సోమయాజులపల్లె, ఓంకారం మధ్య రాకపోకలు ఆగిపోయాయి. అలాగే జీసీ పాలెం వద్ద తెలుగుగంగ కాలువ ఉధృతంగా ప్రవాహిస్తుండంతో నారాణపురం, శింగవరం, లింగాపురం గ్రామాల మధ్య రాకపోకలకు అంతరాయం కలిగింది. పెద్దదేవళాపురం, బండిఆత్మకూరు జగనన్న కాలనీని వరద నీరు చుటుముట్టింది. రుద్రవరం మండలంలో వక్కిలేరు వాగు పొంగి ప్రవహిస్తోంది. కొత్తపల్లి మండలం శివపురం, లింగాపురం గ్రామాల మధ్య ఉన్న ఎద్దులేరు వాగు ఉధృతిగా ప్రవహిస్తుండటంతో పది గ్రామాలకుపైగా రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మండలంలోని దుద్యాల, నందికుంట, శివపురం, కొక్కెరంచ, ముసలిమడుగు, లింగాపురం తదితర గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాలకు వరద నీరు చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

### పరిస్థితులను పర్యవేక్షించండి

**అధికారులను ఆదేశించిన మంత్రి ఫరూక్**

**నంద్యాల (రూరల్), సెప్టెంబరు 1:** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనంతో 3 రోజల నుంచి కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో నంద్యాలలో పరిస్థితులను ఎప్పటికపుడు పర్యవేక్షిస్తుండాలని రాష్ట్ర మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అధికారులను ఆదేశించారు. అధికారులు, పోలీసులతో వెళ్లి నంద్యాలలోని దళితవాడలో మద్దిలేరు, కుందూ నది ఉధృతిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముంపు ప్రాంతాల్లో నివసిస్తున్న వారికి అవసరమైన సహాయక చర్యలు చేపట్టాలన్నారు. అధికారులు నిర్లక్ష్యంగా ఉండకుండా ఎప్పటికపుడు వరదను సమీక్షిస్తుండాలని సూచించారు. విద్యుత్ సరఫరాకు ఇబ్బంది లేకుండా, విద్యుత్ ప్రమాదాలు జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. నంద్యాల పట్టణం, చుట్టుపక్కల ప్రాంతాలలో కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు, పొంగి ప్రవహిస్తున్నందు వల్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని చెప్పారు. మంత్రి వెంట టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఫిరోజ్, నాయకులు విశ్వనాథరెడ్డి, మిద్దె చిన్న హుసేని, శ్యాంసుందర గుప్త, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

### నీట మునిగిన పొలాలు..

భారీ వర్షాలకు పలు చోట్ల పంటలు నీట మునిగాయి. పాములపాడు మండలంలోని భవనాశి నది, నిప్పులవాగు, శుద్ధవంక తదితర పరివాహక ప్రాంతాల్లోని ఇస్కాల, వేంపెంట, ఎర్రగూడూరు, భానుముక్కల, కంబాలపల్లి గ్రామాల్లో మొక్కజొన్న 1300, మినుము 80, మిరప 40, సోయాబీన్ 80 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నట్లు వ్యవసాయ శాఖ అదికారులు అంచనా వేశారు. వెలుగోడు మండలం నల్లమల అటవీ ప్రాంతంలోని పెద్ద మల్లెలమ్మ చెరువు అలుగు పారి పంట పొలాల్లోకి నీరు చేరింది. దీంతో సుమారు 350 ఎకరాల్లో వరి పంట నష్టం జరిగినట్లు అధికారులు తెలిపారు. అంతేగాకుండా మండలంలోని పలు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. బండిఆత్మకూరు మండలంలోని పలు గ్రామాల్లో పొలాలు నీట మునిగాయి. రుద్రవరం మండలంలోని మందలూరు గ్రామ సమీపంలో 19వ గంగ బ్లాక్ చానెల్ పొంగి ప్రవహించడంతో సుమారు 50 ఎకరాల్లో పంటలు నీట మునిగాయి. పాణ్యం బస్టాండ్ సమీపంలోని ఓ ఇంటి పైకప్పు కూలింది.

### పోలీసులు అప్రమత్తం

ఆత్మకూరు ప్రాంతంలో భారీ వర్షాలు ప్రజల్ని అతలాకుతలం చేయడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఆత్మకూరు డీఎస్పీ రామాంజీనాయక్, రూరల్ సీఐ సురేష్‌కుమార్‌రెడ్డి, ఎస్సై వెంకటనారాయణరెడ్డి ఉధృతంగా ప్రవహిస్తున్న ఆయా వాగులను సందర్శించి ప్రజలకు తగిన హెచ్చరికలు జారీ చేశారు. అదేవిధంగా నల్లమల ఘాట్ రోడ్డులో శనివారం రాత్రి చెట్టు విరిగిపడి ట్రాఫిక్ సమస్య ఏర్పడడంతో భారీ వాహనాలను వెళ్లనివ్వకుండా చర్యలు చేపట్టారు. ఎడతెరిపి లేని వర్షాల నేపథ్యంలో శ్రీశైలానికి వెళ్లే భక్తులు తమ పర్యటనను వాయిదా వేసుకోవాలని ఆత్మకూరు డీఎస్పీ రామాంజినాయక్ విజ్ఞప్తి చేశారు.


నంద్యాలలోని కుందూ నది వద్ద అధికారులు, పోలీసులకు సూచనలు చేస్తున్న మంత్రి ఫరూక్


నంద్యాల పట్టణ శివారులో ఉధృతంగా ప్రవహిస్తున్న కుందూ నది


రుద్రవరం మండలం చిలకలూరు గ్రామ సమీపంలో పొంగి ప్రవహిస్తున్న వకుళా నది


ఉప్పొంగిన భవనాశి నది

### నిండుకుండలా వరదరాజ స్వామి ప్రాజెక్టు


వరదరాజ స్వామి ప్రాజెక్టు

**ఆత్మకూరు, సెప్టెంబరు 1:** వరదరాజ స్వామి ప్రాజెక్ట్ నిండుకుండలా కనిపిస్తోంది. నల్లమలలో కురిసిన భారీ వర్షాలతో ఆదివారం ఉదయం 10.30గంటలకు ప్రాజెక్ట్ గరిష్ట నీటి మట్టం 370 అడుగులకు గాను 369.50 అడుగులకు నీటి నిల్వలు చేరాయి. అదే విధంగా ప్రాజెక్ట్ గరిష్ట నీటి సామర్థ్యం 389.173 ఎంసీఎఫ్‌టీలకు గాను 374.623 ఎంసీఎఫ్‌టీలకు చేరుకుంది. దీంతో ప్రాజెక్ట్ పరిధిలోని ఆయా గ్రామాల చెరువులకు వంద క్యూసెక్కుల నీటిని విడుదల చేసి మళ్లిస్తున్నారు.

### 300 ఎకరాల్లో పంట నష్టం

**వెలుగోడు, సెప్టెంబరు 1:** వెలుగోడు మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు సుమారు 350 ఎకరాల్లో వరి పంట నష్టం జరిగిందని ఏవో పవన్‌కుమార్ తెలిపారు. నల్లమల అటవీ ప్రాంతంలోని పెద్ద మల్లెలమ్మ చెరువు నిండి అలుగు పారడంతో పంట పొలాల్లోకి నీరు ప్రవహిస్తోంది. దీంతో గిరిజనుల పంట పొలాలు నీట మునిగాయి. వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.


ఆత్మకూరులోని రంగమహల్ థియేటర్ వద్ద నేలకూలిన వేప చెట్టు


ఆత్మకూరు మండలంలోని వడ్లరామాపురం గ్రామంలోకి చేరిన వర్షపు నీరు

## శ్రీశైలానికి 5,02,244 క్యూసెక్కుల వరద



**శ్రీశైలం, సెప్టెంబరు 1:** శ్రీశైలం జలాశయానికి ఆదివారం వరద ప్రవాహం భారీగా నమోదైంది. ఎగువ పరివాహక ప్రాంతాలు జూరాల నుంచి 3,87,918 క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 4,479 క్యూసెక్కులు మొత్తం 3,92,397 వరద నీరు వస్తోంది. డ్యాం అధికారులు జలాశయం పది క్రస్టు గేట్లను ఎత్తి 4,06,242 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఆదివారం సాయంత్రం 6 గంటల సమాయానికి జలాశయానికి 5,02,244 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరింది. శ్రీశైలం జలాశయం పూర్తి స్థాయి నీటి మట్టం 885 అడుగులు కాగా ప్రస్తుత నీటి మట్టం 884.90 అడుగులుగా నమోదయింది. జలాశయం పూర్తి స్థాయి నీటి నిల్వ 215.807 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటి నిల్వ 214.3638 టీఎంసీలుగా నమోదయింది. ఆంధ్రప్రదేశ్ జలవిద్యుత్ కేంద్రం ద్వారా 30181 క్యూసెక్కులు, తెలంగాణ జల విద్యుత్ కేంద్రం ద్వారా 37,882 క్యూసెక్కులు, డ్యాం క్రస్టుగేట్ల ద్వారా 4,06,242 క్యూసెక్కులు మొత్తం 4,74,305 క్యూసెక్కుల నీటిని దిగువ నాగార్జున సాగర్ ప్రాజెక్టుకు విడుదల చేస్తున్నారు.

### వీబీఆర్‌కు జలకళ

**వెలుగోడు, సెప్టెంబరు 1:** తెలుగుగంగలో అంతర్భాగమైన వెలుగోడు జలాశయం నిండుకుండలా మారింది. ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద జలాలు చేరుతూ ఉండటంతో జలాశయం నిండుతోంది. జలాశయంలో 264. 70 మీటర్ల వద్ద 14.935 టీఎంసీల నీరు నిలువ ఉంది. వెలుగోడు జలాశయానికి బానకచెర్ల సముదాయం నుంచి 8200 క్యూసెక్కులు, అటవీ ప్రాంతలో కురిసిన వర్షపు నీరు 6100 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. జలాశయం నుంచి స్పిల్ వే రెండు గేట్ల ద్వారా 6200 క్యూసెక్కులు, వన్‌ఆర్ నుంచి పది క్యూసెక్కులు, చెన్నై ప్రధాన కాలువకు 5 వేల క్యూసెక్కులు, చెన్నై తాగునీటి పథకానికి పది క్యూసెక్కుల చొప్పున దిగువకు నీరు విడుదల చేస్తున్నారు. జలాశయ సామర్థ్యం 16.95 టీఎంసీలు కాగా ఆదివారం సుమారు 15 టీఎంసీల నీరు చేరింది.


నిండుకుండలా వెలుగోడు జలాశయం

## శ్రీశైలంలో అత్యవసర సేవలు

**శ్రీశైలం, సెప్టెంబరు 1:** గత మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల వలన మల్లన్న భక్తులు ఇబ్బందులకు గురి కాకుండా దేవస్థానం ముందస్తు చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా ఆదివారం ఆలయ కార్యనిర్వహణాధికారి డి. పెద్దిరాజు దేవస్థానం కార్యాలయ భవనంలోని సమావేశ మందిరంలో భక్తుల సౌకర్యాలపై ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఆలయ డిప్యూటీ కార్యనిర్వహణాధికారి, ప్రధానార్చకులు, సీనియర్ వేదపండితులు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, అన్ని విభాగాల యూనిట్ అధికారులు, పర్యవేక్షకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ యాత్రికులు సహాయం పొందేందుకు కంట్రోల్ రూమ్‌లో ఫోన్ నెంబరు 08524-293015 అందుబాటులో ఉంచామని తెలిపారు. దేవస్థానం ప్రసార వ్యవస్థ మైక్ అనౌన్స్‌మెంట్ ద్వారా ఎప్పటికప్పుడు అత్యవసర ఫోన్ నెంబరును తెలపాలన్నారు. వర్షాలు తగ్గుముఖం పట్టేవరకు భక్తులకు పాతాళగంగ మార్గంలోని డార్మెటరీ, టూరిస్టు బస్టాండ్ వద్దగల డార్మెటరీలలో ఉచిత వసతి సదుపాయం కల్పించినట్లు తెలిపారు. క్షేత్ర పరిధిలో నివసిస్తున్న వారిలో వర్షం ప్రభావంతో ఇబ్బందులు పడుతుంటే వారికి దేవస్థానం అన్నదాన భవనంలో భోజన ప్రసాదాలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అత్యవసర సమయాల్లో సహాయం అందించేందుకు దేవస్థానంలోని అన్ని విభాగాల సిబ్బంది సిద్ధంగా ఉండాలని సూచించారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఈవో పెద్దిరాజు

### ఘనంగా పెద్దరాజు స్వాముల ఉరుసు

**బేతంచెర్ల, సెప్టెంబరు 1:** మండలంలోని గూటుపల్లెలో వెలసిన హజరత్ సయ్యద్ షా అబ్దుల్ రెహిమాన్ ఇద్రుస్ బాషా పెద్దరాజు స్వాముల ఉరుసు మత సామరస్యానికి ప్రతీకగా హిందు ముస్లింలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దరాజుల స్వామికి భక్తులు ఫతేహాలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ ఉత్సవాలకు కర్ణాటక, మహారాష్ట్ర, గోవా ప్రాంతాలకు చెందిన భక్తులతోపాటు మండలంలోని వివిధ గ్రామాల నుంచి అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు.


గంధంతో గుర్రంపై దర్గాకు వెళ్తున్న పీఠాధిపతి

### సుంకేసుల డ్యామ్ భద్రతపై ఆందోళన వద్దు

**మంత్రి టీజీ భరత్**



**కర్నూలు(అర్బన్), సెప్టెంబరు 1:** సుంకేసుల డ్యామ్ భద్రతపై ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి టీజీ భరత్ అన్నారు. ఆదివారం విజయవాడ నుంచి కలెక్టర్, ఇరిగేషన్ శాఖ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సుంకేసుల డ్యామ్ వద్ద కుంగిన మట్టి కరకట్టను పూడ్చేందుకు అధికారులు వేగంగా చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. సుంకేసుల డ్యామ్ భద్రతకు ఎలాంటి అటంకం కలగకుండా చూడాలని ఆధికారులను ఆదేశించామన్నారు. జిల్లాలో కురుస్తున్న వర్షాలు, వరద ప్రభావంతో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించామన్నారు. ప్రజలకు సహాయ చర్యలు అందించడంలో అధికారులు పూర్తి స్థాయిలో అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించామని చెప్పారు.

### నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

**నంద్యాల (కల్చరల్), సెప్టెంబరు 1:** ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక సోమవారం నంద్యాల జిల్లా కలెక్టరేట్ లోని సెంటనరీ హాలులో నిర్వహిస్తున్న కలెక్టర్ జి.రాజకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమస్యలపై ప్రజల నుంచి దరఖాస్తులను పబ్లిక్ గ్రీవియన్స్ రెడ్రెస్సల్ సిస్టం ద్వారా (పీజీఆర్ఎస్) ద్వారా చేపడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమానికి జిల్లా స్థాయి అధికారులు ఉదయం 9:30 గంటలకే హాజరు కావాలని కలెక్టర్ తెలిపారు. అలాగే జిల్లా కేంద్రంతోపాటు మండల, నియోజకవర్గ, డివిజన్ స్థాయిలో కూడా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

## బాలికపై వైసీపీ కార్యకర్త అత్యాచారయత్నం..!

### దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించిన తల్లి, గ్రామస్తులు


ప్రభుదాసు అవుకు పోలీస్ స్టేషన్‌కు తరలిస్తున్న పోలీసులు

**అవుకు, సెప్టెంబరు 1:** ఓ బాలికపై వైసీపీ కార్యకర్త అత్యాచారానికి యత్నించిన సంఘటన నంద్యాల జిల్లా అవుకు మండలంలో ఆదివారం చోటు చేసుకుంది. బాలిక తల్లిదండ్రులు, గ్రామస్తులు గమనించడంతో బాలిక సురక్షితంగా బయటపడింది. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. అవుకు మండలంలోని ఓ గ్రామానికి చెందిన మోపూరి ప్రభుదాసు వైసీపీలో క్రియాశీలక కార్యకర్తగా ఉన్నాడు. ఆయన భార్య గతంలో ఎంపీటీసీగా వైసీపీ మద్దతుతో పోటీచేసి ఓడిపోయింది. ప్రస్తుతం ప్రభుదాసు కోవెలకుంట్లలోని ఓ ప్రైవేటు పాఠశాలకు బస్సు డ్రైవరుగా పనిచేస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన ఓ బాలిక కోవెలకుంట్లలోని ఓ ప్రైవేటు పాఠశాలలో 8వ తరగతి చదువుతోంది. బాలిక రోజూ ప్రభుదాసు నడిపే బస్సులోనే పాఠశాలకు వెళ్లి వచ్చేది. దీంతో అతడి కన్ను బాలికపై పడింది. ఆదివారం సెలవు దినం కావటంతో బాలిక ఇంట్లోనే ఉండిపోయింది. బాలిక తల్లిదండ్రులు ఉదయాన్నే పొలం పనులకు వెళ్లిన విషయాన్ని తెలుసుకున్న ప్రభుదాసు విద్యార్థిని ఇంట్లోకి చొరబడ్డాడు. బాలికతో అనుచితంగా వ్యవహరిస్తూ అత్యాచారానికి యత్నించాడు. ఇదే సమయంలో పొలం పనులకు వెళ్లిన విద్యార్థిని తల్లి ఇంటికి వచ్చింది. ఇంటిలోపలి నుంచి కూతురు కేకలు వినిపించడంతో పరుగున వెళ్లింది. జరుగుతున్న ఘటనను చూసి కేకలు వేసి, చుట్టు పక్కల వారిని పిలిచింది. అందరూ కలిసి నిందితుడు ప్రభుదాసును పట్టుకొని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అవుకు ఎస్‌ఐ రాజారెడ్డి వెల్లడించారు.

## డిగ్రీ సప్లిమెంటరీ ఫలితాలు విడుదల

**కర్నూలు(అర్బన్), సెప్టెంబరు 1:** రాయలసీమ యూనివర్సిటీలో డిగ్రీ స్పెషల్ సప్లిమెంటరీ పరీక్షా ఫలితాలను కంట్రోలర్ ఎస్. వెంకటేశ్వర్లు విడుదల చేశారు. గత నెలలో నిర్వహించిన పరీక్షలకు సంబంధించి 1 సెమిస్టర్‌కు 55కు 46, 2వ సెమిస్టర్‌కు 125కు 94, 3వ సెమిస్టర్‌కు 53కు 48, 4వ సెమిస్టర్‌కు 67కు 59, 5వ సెమిస్టర్‌కు 1012కు 923, 6వ సెమిస్టర్‌కు 53 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 46 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని, మరిన్ని వివరాలకు వర్సిటీ వెబ్‌సైట్‌లో సంప్రదించాలని తెలిపారు.

## గణేశ్ ఉత్సవాలకు సింగిల్ విండో విధానం

### ప్రత్యేక పోర్టల్‌ను రూపొందించిన ప్రభుత్వం

**కర్నూలు, సెప్టెంబరు 1:** ఈ ఏడాది గణేశ్ ఉత్సవాల నిర్వహణకు సింగిల్ విండో విధానం రూపొందించారు. విగ్రహాల ఏర్పాటుకు అనుమతులు ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక పోర్టల్ ఏర్పాటు చేసింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు శాఖ అన్ని పకడ్బందీ చర్యలు తీసుకుంది. విగ్రహాల ఏర్పాటుకు మరో ఆరు రోజులే గడువు ఉండటంతో అనుమతుల ప్రక్రియ వేగవంతం చేసేందుకు కొత్త తరహా విధానాన్ని తీసుకు వచ్చింది.

**అనుమతుల ప్రక్రియ ఇలా:**

గణేష్ ఉత్సవాలకు Http-s://ganeshutsav.net వెబ్‌సైట్‌లో ఈ అనుమతుల ప్రక్రియను కొనసాగిస్తున్నారు. అలాగే చాట్‌బట్ సేవలకు 7995095800 మొబైల్ నెంబర్‌ను కేటాయించారు. నిర్వాహకులు మొబైల్ నెంబర్‌కు 'ఏజీ' అని సందేశం పంపిస్తే ఎన్‌వోసీ పత్రం కోసం అనుసరించాల్సిన ప్రక్రియ మొత్తం మీ వాట్సాప్‌కు వస్తుంది.

**ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలు జరుపుకోవాలి**

గణేష్ ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో జరుపుకునేందుకు అందరూ సహకరించాలి. విగ్రహాల ఏర్పాటు అనుమతి ప్రక్రియ అంతా ఆన్‌లైన్ ద్వారా జరుగుతుంది. నిర్వాహకులు కచ్చితంగా అనుమతి పత్రాలు, క్యూఆర్ కోడ్ అందుబాటులో ఉంచుకోవాలి. శాంతిభద్రతలు, మతపర ఘర్షణలు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. - బిందు మాధవ్, ఎస్పీ

## విద్యార్థి ఆత్మహత్య

### ఫ్రీ ఫైర్ గేమ్ ఆడొద్దని మందలించినందుకు..

**కర్నూలు, సెప్టెంబరు 1:** తరచూ సెల్‌ఫోన్‌లో ఫ్రీ ఫైర్ గేమ్ ఆడుతుంటే.. తల్లిదండ్రులు మందలించారు. దీంతో మనస్తాపానికి గురైన బబ్లూ అలియాస్ రాహుల్ (14) అనే విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన ఆదివారం జరిగింది. టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎల్‌బీఎస్ నగర్‌కు చెందిన రమేష్, ఈశ్వరమ్మ దంపతులకు ఇద్దరు కొడుకులు సంతానం. రమేష్ టైలరింగ్ పని చేస్తున్నాడు. ఈశ్వరమ్మ ప్రైవేటు ఆసుపత్రిలో నర్సుగా పని చేస్తున్నారు. పెద్దకొడుకు వంశీకృష్ణ ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. చిన్న కొడుకు రాహుల్ ప్రైవేటు స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్నాడు. ఆదివారం మధ్యాహ్నం సెల్‌ఫోన్‌లో ఫ్రీఫైర్ గేమ్ ఆడుతుండటంతో తల్లిదండ్రులు మందలించారు. దీంతో మనస్తాపానికి గురైన రాహుల్ తండ్రి నిర్వహిస్తున్న నక్షత్ర టైలరింగ్ షాపు వద్దకు వెళ్లి తండ్రి ఇంటికి వెళ్లగానే ఉరి వేసుకున్నాడు. తండ్రి రమేష్ భోజనానికి వెళ్లి తిరిగి వచ్చేసరికి కొడుకు విగతజీవిగా కనిపించాడు. రాహుల్‌ను ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నాగరాజు రావు తెలిపారు.

## దళితులు ఆత్మగౌరవాన్ని కాపాడుకోవాలి

- సమష్టిగా ఉంటేనే లక్ష్యాన్ని చేరుకుంటాం
- ఎస్సీ, ఎస్టీ ఆఫీసర్స్ అసోసియేషన్ నేత కృష్ణారావు

**కర్నూలు(అగ్రికల్చర్), సెప్టెంబరు 1:** ఉన్నతమైన పదవుల్లో ఉన్నా సరైన గౌరవాన్ని పొందలేకపోతున్న దళితులు తమ ఆత్మగౌరవాన్ని కాపడుకోడానికి ఉద్యమించాలని ఎస్సీ, ఎస్టీ ఆఫీసర్స్ అసోసియేషన్ కోఆర్డినేటర్ డా.సీహెచ్ కృష్ణారావు అన్నారు. ఇటీవల నంద్యాల జిల్లా పశువైద్యశాఖ అధికారి పై కులవివక్షతో జరిగిన దాడిని ఏపీ పశుసంవర్ధకశాఖ ఎస్సీ, ఎస్టీ ఆఫీసర్స్ అసోసియేషన్ నేతలు తీవ్రంగా ఖండించారు. కర్నూలు నగరంలోని ప్రైమ్ ల్యాండ్ హోటల్‌లో ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దళిత ఆత్మగౌరవ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో గత నెల 28న నంద్యాల జిల్లా పశువైద్యశాఖ అధికారి కార్యాలయాన్ని ఉమ్మడి జిల్లాలకు చెందిన పశుసంవర్ధకశాఖ ఉద్యోగులు మూకుమ్మడిగా ముట్టడించి దాడి చేయడం దారుణమని అన్నారు. ఈ సంఘటన రాష్ట్ర వ్యాప్తంగా దళిత ఉద్యోగులను అవమానించడమేనని ఆయన అన్నారు. నీతి నిజాయితీతో పని చేస్తున్న జిల్లా అధికారి మీద ఆరోపణలు చేయడం దారుణమని అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఆర్.నాగరాజు మండిపడ్డారు.

## అండర్-23 జాతీయ స్థాయి బాస్కెట్ బాల్ పోటీలు

- రాష్ట్ర పరిశీలకుడు సురేష్


మాట్లాడుతున్న సురేష్

**కర్నూలు (స్పోర్ట్స్), సెప్టెంబరు 1:** ఈ విద్యాసంవత్సరం నుంచి కొత్తగా జాతీయ స్థాయిలో అండర్-23 విభాగంలో మహిళల పురుషుల విభాగంలో పోటీలు నిర్వహిస్తారని ఏపీ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ పరిశీలకులు సురేష్ వెల్లడించారు. ఆదివారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ అవుట్‌డోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన జిల్లా బాస్కెట్‌బాల్ సంఘం సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వీలైనంత త్వరలో 26 జిల్లాల్లో బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ పరిశీలకులు బి. రామాంజనేయులు, జిల్లా స్పోర్ట్స్ అథారిటీ నుంచి కాశీపతిరావు పాల్గొన్నారు.

## 4న జిల్లా పరిషత్ స్థాయి సంఘాల సమావేశాలు

**కర్నూలు(న్యూసిటీ), సెప్టెంబరు 1:** జిల్లా పరిషత్ స్థాయి సంఘాల సమావేశాలు 4న నిర్వహించనున్నట్లు జడ్పీ సీఈఓ జి. నాసరరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిషత్‌లోని మినీ సమావేశ భవనంలో ఏడవ స్థాయి సంఘ సమావేశాలు నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారని ఆయన తెలిపారు. ఉదయం 10 గంటల నుండి 10.30 గంటల వరకు 2వ స్థాయి సంఘం, 10.30 నుండి 11.00 గంటల వరకు 3వ స్థాయి సంఘం, 11.00 గంటల నుండి 11.30 గంటల వరకు 6వ స్థాయి సంఘం, మధ్యాహ్నం 11.30 నుంచి 12.00 గంటల వరకు 4వస్థాయి సంఘం, 12.00 నుంచి 12.30 వరకు 5వ స్థాయి సంఘం, 12.30 నుంచి 1.30 వరకు 1, 7వ స్థాయి సంఘాల సమావేశాలు నిర్వహించనున్నట్లు సీఈఓ పేర్కొన్నారు.

# అధికారులు కావలెను..!

- గాడి తప్పుతున్న నగర పాలక సంస్థ కార్యాలయం
- ఇష్టారాజ్యంగా ఉద్యోగులు



**కర్నూలు(న్యూసిటీ), సెప్టెంబరు 1:** నగర పాలక సంస్థ కార్యాలయంలో ప్రధానమైన పోస్టులలో అధికారులు లేకపోవడంతో పాలన గాడితప్పుతోందని చెప్పవచ్చు. కమిషనర్‌గా ఉన్న ఏ. భార్గవతేజ గత నెల గుంటూరు జాయింట్ కలెక్టర్‌గా బదిలీపై వెళ్లారు. దీంతో అడిషనల్ కమిషనర్ పివి. రామలింగేశ్వర్‌కు అదనపు కమిషనర్‌గా పూర్తి బాధ్యతలు అప్పగించారు. అప్పటి నుంచి కమిషనర్ పోస్టు ఖాళీగానే ఉంది. అయితే ఇటీవల ప్రకాశం జిల్లా కందుకూరు సబ్‌కలెక్టర్ విద్యాధరిని కమిషనర్‌గా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అప్పుడో..ఇప్పుడో కమిషనర్‌గా బాధ్యతలు తీసుకుంటారని భావించిన తరుణంలో ఆమెను చిత్తూరు జాయింట్ కలెక్టర్‌గా నియమించారు. ఇక చేసేదేమి లేక నాన్ ఐఏఎస్ రవీంద్రబాబును కమిషనర్‌గా నియమిస్తూ రెండు రోజుల క్రితం ఆ శాఖ ప్రత్యేక కార్యదర్శి అనిల్‌కుమార్ సింఘాల్ ఉత్తర్వులు జారీ చేశారు. సుమారు రెండు నెలల పాటు అడిషనల్ కమిషనరే ఇన్‌చార్జి కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహించారు.

- పట్టణ ప్రణాళికా విభాగంలో గత సంవత్సరం సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్ బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో మీనాకుమారిని నియమించారు. ఆమె కేవలం రెండు నెలలు మాత్రమే చేసి వ్యక్తిగత సెలవులో వెళ్లారు. అప్పటి నుంచి ఇక్కడే డిప్యూటీ సిటీ ప్లానర్‌గా విధులు నిర్వహిస్తున్న మోహన్‌కుమార్‌కు సీపీగా ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఈ క్రమంలో వైసీపీ ప్రజాప్రతినిధుల నుంచి ఒత్తిళ్లు రావడంతో సెలవు పెట్టుకుని...అక్కడి నుంచి చిత్తూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీకి బదిలీపై వెళ్లారు. దీంతో కుడాలో పని చేస్తున్న డీసీపీ సంధ్యారాణిని నగర పాలక సంస్థకు కేటాయించారు. టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్‌గా పని చేస్తున్న హరీష్‌కుమార్ చౌదరి కూడ రాజకీయ నాయకుల ఒత్తిళ్లు తట్టుకోలేక అనంతపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీకి డిప్యుటేషన్ ప్రాతిపదికన వెళ్లారు. ఇక్కడే పని చేస్తున్న అసిస్టెంట్ సిటీ ప్లానర్ హయత్ మోహిద్దీన్ కర్నూలు కుడాకు వెళ్లారు. మరో టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ రాధాకృష్ణపై అవినీతి ఆరోపణలు రావడంతో అతనిని మాతృసంస్థకు సరెండర్ చేశారు.

డిప్యూటీ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న రమాదేవిని కొందరు కార్పొరేటర్లు బలవంతంగా బదిలీపై వెళ్లేలా చేసి తమ పంతాన్ని నెగ్గించుకున్నారు. ఈ క్రమంలో వెంకటశివారెడ్డిని గత సంవత్సరం డిప్యూటీ కమిషనర్‌గా నియమించారు. అయితే ఆయనను మాతృసంస్థకు బదిలీ చేశారు. ఈ క్రమంలో సుమారు మూడు నెలలపాటు డీసీ పోస్టు ఖాళీగానే ఉండేది. ఈ తరుణంలో మళ్లీ ఆయననే ఇక్కడికి నియమించారు. వచ్చిన నెలకే పదవీ విరమణ చేయడంతో సుమారు ఏడు నెలల నుంచి ఆ పోస్టుకు ఎవ్వరినీ నియమించలేదు. ప్రధానంగా పారిశుధ్య విభాగాన్ని పర్యవేక్షించాల్సిన డీసీ పోస్టు ఖాళీగా ఉండటంతో ఆ విభాగం గాడి తప్పింది.

- ఇంజనీరింగ్ విభాగంలో ఓ డీఈ పోస్టు ఖాళీగా ఉంది. ఆయ నపై ఆరోపణలు రావడంతో ఈఎన్‌సీ కార్యాలయంలో రిపో ర్టు చేసుకోవాలని అప్పటి కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే వివిధ శాఖలలో పదవీ విరమణ పొందిన స్థానంలో జూనియర్ అసిసెంట్లకు సీనియర్ అసిస్టెంటుల్లుగా, ఇన్‌చార్జిలు గా బాధ్యతలు అప్పచెప్పి విధులు నిర్వహించే విధంగా చేస్తున్నారు. పాలక మండలి సభ్యులు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకు వచ్చి వెంటనే ఖాళీ పోస్టులన్నీ భర్తీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

- నగర పాలకలోని కొన్ని విభాగాలలో అవినీతికి హద్దులేకుండా పోయింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అధికారులు, ప్రజాప్రతినిధులు అందినకాడికి దోచుకున్నారు. ఏ విభాగంలో పనులు కావాలన్నా ప్రజలు మామూళ్లు ముట్టచెప్పుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. లేనిపక్షంలో ఎక్కడి ఫైల్ అక్కడే నిలిచిపోతుంది. కొందరు అధికారులు, ఉద్యోగులు పని చేయకుండా ఆలస్యం చేస్తూ ప్రజలను వేధిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. వీరికి తోడుగా సచివాలయ ఉద్యోగులు కూడా మామూళ్ల మత్తులో తూగుతున్నారు. అందుకు నిదర్శనమే కొన్ని సచివాలయాల పరిధిలో అక్రమ లేఅవుట్లు గుర్తించి వాటికి ఇటీవల కమిషనర్ నోటీసులు కూడ జారీ చేశారు. గృహ నిర్మాణంలో జరిగే వాటిని అపకుండా వారి నుంచి మామూళ్ల వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

# పంట నష్టంపై సర్వే

- నివేదిక తయారు చేసి ప్రభుత్వానికి పంపుతాం
- జాయింట్ కలెక్టర్ నవ్య


వేరుశనగ పంటను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ నవ్య

**గోనెగండ్ల/ఎమ్మిగనూరు, సెప్టెంబరు 1:** జిల్లాలో వర్షాలకు దెబ్బతిన్న పంటలపై సర్వే చేసి ప్రభుత్వానికి నివేదిక పంపుతామని కర్నూలు జిల్లా జాయింట్ కలెక్టర్ నవ్య తెలిపారు. ఆదివారం గోనెగండ్ల, గంజహళ్లి, వేముగోడు, పుట్టపాశం, హెచ్ కైరవాడి గ్రామాల పరిధిలోని వర్షానికి దెబ్బతిన్న పంట పొలాలను ఆమె పరిశీలించారు. ఎంత నష్టం వస్తుందని వేరుశనగ సాగు చేసిన రైతులను అడిగి తెలుసుకున్నారు. రైతులు బుడ్డప్ప, హసన్ మాట్లాడుతూ మూడు ఎకరాలకు రూ.2 లక్షల పెట్టుబడి పెట్టామని, భారీ వర్షాల వల్ల పంట మొత్తం నానిపోయి నల్లబారిందని అన్నారు. జేసీ స్పందిస్తూ పంట బీమా వచ్చేలా చూస్తామన్నారు. ఎమ్మిగనూరు మండలం రాళ్లదొడ్డి గ్రామంలో తడిసిన వేరుశనగ పంటను జాయింట్ కలెక్టర్ నవ్య పరిశీలించారు. రైతు చాంద్ బాషా పొలంలో వేరుశనగను పరిశీలించి మాట్లాడారు. కార్యక్రమంలో ఆదోని ఆర్‌డీవో విశ్వనాథ్, తహసీల్దార్ కుమారస్వామి, ఏడీఏ మహమ్మద్ ఖాద్రి, ఏవో హేమలత, మహేంద్ర పాల్గొన్నారు.

- గోనెగండ్ల తహసీల్దార్ కుమారస్వామిపై జేసీ ఆగ్రహం వ్యక్తం చేశారు. పంటల పరిశీలనకు వచ్చిన గంట తరువాత కూడా తహసీల్దార్ ఆ ప్రాంతానికి రాలేదు. జాయింట్ కలెక్టర్ తిరుగు ప్రయాణమయ్యే సమయంలో తహసీల్దార్ అక్కడకు వచ్చారు. దీంతో విధుల పట్ల ఇంత నిర్లక్ష్యంగా ఉంటే ఎలా అని ఆమె మండిపడ్డారు. రైతులు కష్టాలలో ఉంటే ఏం చేస్తున్నారని, పంటలను పరిశీలించకుండా నివేదిక ఎలా తయారు చేస్తామని అన్నారు.

## అప్రమత్తంతోనే జ్వరాల నివారణ

### డీఎంహెచ్‌వో డాక్టర్ ఎల్.భాస్కర్



**కర్నూలు(హాస్పిటల్), సెప్టెంబరు 1:** అప్రమత్తంగా ఉండడం వల్ల సీజనల్ వ్యాధులు, సాధారణ జ్వరాలను నివారించ వచ్చని డీఎంహెచ్‌వో డా.ఎల్.భాస్కర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తాగునీటిని కాచి వడబోసి చల్లార్చిన తర్వాత మాత్రమే తాగాలని, ప్రతి రోజూ ఇంటిలో అప్పటికప్పుడు తయారు చేసిన ఆహారాన్ని తీసుకోవాలని అన్నారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఇంటి చుట్టుపక్కల నీరు నిల్వ ఉన్న ఎడల నీటి గుంతలను మట్టితో కప్పి వేయాలని సూచించారు. ఇంటిలో పాతటైర్లు, టెంకాయల చిప్పలు, పాతవాటర్ బాటిల్స్‌ను పడేయాలని అన్నారు. ఇంట్లోకి దోమలు ప్రవేశించకుండా సాయంత్రం 6 గంటలకు ఇంటి తలుపులు, కిటికీలను మూసివేయాలని, ఇంటిలోగానీ పక్కనగానీ ఎవరైనా జ్వరంతో బాధపడితే స్థానికంగా ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీలకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

## రాష్ట్ర స్థాయి అండర్-17 ల్యాక్రోస్ క్రీడలు ఆరంభం


క్రీడల్లో పాల్గొన్న క్రీడాకారులు

**కోసిగి, సెప్టెంబరు 1:** మండల పరిధిలోని డి.బెళగల్ గ్రామంలో రాష్ట్ర స్థాయి అండర్-17 ల్యాక్రోస్ క్రీడలు రాష్ట్ర అసోసియేషన్ ఆధ్వర్యంలో డి. బెళగల్ గ్రామ విజేత యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథులుగా ల్యాక్రోస్ క్రీడల రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మునికృష్ణయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేందర్ రెడ్డి, గ్రామ సర్పంచ్ పద్మ, రామయ్య, కోసిగి బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఖలీల్ అహ్మద్ హాజరయ్యారు. ఈ క్రీడా పోటీల కు విజయనగరం, కర్నూలు, గుంటూరు, ప్రకాశం, ఒంగోలు, అనంతపురం, బాపట్ల, శ్రీకాకుళం, చిత్తూరు, తిరుపతి జిల్లాల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో మెడికల్ క్యాంపులు నిర్వహించండి

### కలెక్టర్ పి. రంజిత్‌బాషా

**కర్నూలు(కలెక్టరేట్), సెప్టెంబరు 1:** గ్రామాల్లో మెడికల్ క్యాంపులు నిర్వహించాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం భారీ వర్షాలు, పింఛన్ల పంపిణీపై అధికారులతో కలెక్టర్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారీ వర్షాల నేపథ్యంలో సోమవారం జిల్లాలోని అన్ని పాఠశాలలు, అంగన్‌వాడీ సెంటర్లు, కళాశాలలకు ప్రభుత్వ సెలవు ప్రకటించిందని అన్నారు. వర్షాల నేపథ్యంలో తహసీల్దార్లు, మండల స్పెషల్ ఆఫీసర్లు వారి పరిధిలోని హాస్టళ్లు, పాఠశాలలను తనిఖీలు చేయాలన్నారు. సోమవారం, మంగళవారం మండల వ్యవసాయాధికారులు పంటలను మరోసారి పరిశీలించి నష్టంపై నివేదికను అందజేయాలని ఆదేశించారు. గ్రామాల్లో శానిటేషన్ పైన ప్రత్యేక దృష్టి సారించాలని డీపీవో, జడ్పీ సీఈవోలకు సూచించారు. గ్రామాల్లో నిల్వ ఉన్న వర్షం నీరు వేగవంతంగా క్లియర్ చేయించాలన్నారు. ప్రతి గ్రామంలో బ్లీచింగ్ చేయించాలన్నారు. తాగునీటి లీకేజీలు ఏవైనా ఉంటే వెరిఫై చేయించాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈని ఆదేశించారు. తాగునీటి పరీక్షలను నిర్వహించాలని ఆదేశించారు. ఇప్పటి వరకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లు 97 శాతం పంపిణీ పూర్తయిందని మిగిలిన మూడు శాతం సోమవారం మధ్యాహ్నం లోపు పూర్తి చేయాలన్నారు. టెలికాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ బి.నవ్య, ఆర్డీవోలు జిల్లా అధికారులు, స్పెషల్ ఆఫీసర్లు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

## కుంగిన సుంకేసుల బ్యారేజీ మట్టి కట్ట

### అప్రమత్తమైన అధికారులు


మరమ్మతులు చేస్తున్న అధికారులు

**కర్నూలు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి):** కేసీ కాలువ ఆయకట్టు రైతుల జీవనాడి సుంకేసుల జలాశయం మట్టికట్ట ఓ వైపు కుంగిపోవడంతో ఇంజనీర్లు అప్రమత్తమయ్యారు. తక్షణ మే మరమ్మతులు చేపట్టారు. తెలంగాణ రాష్ట్రం వైపు వర్షపు నీటికి కోతకు గురై కట్ట కుంగిపోయిందని ప్రాజెక్టు డీఈఈ రఘురామిరెడ్డి వివరించారు. సుంకేసుల డ్యాం గరిష్ఠ నీటి మట్టం 292 మీటర్లు, సామర్థ్యం 1.20 టీఎంసీలు. ఆదివారం జలాశయంలోకి 5,944 క్యూసెక్కులు వరద వచ్చి చేరింది. 1,465 క్యూసెక్కులు కేసీ కాలువకు వదులుతున్నారు. 4,479 క్యూసెక్కులు గేట్లెత్తి దిగువ శ్రీశైలం జలాశయానికి విడుదల చేస్తున్నారు. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల్లో సరిహద్దుల్లో ఓ మోస్తారుగా వర్షాలు కురుస్తు న్నాయి. తెలంగాణ రాష్ట్రం జోగులాంబ గద్వాల జిల్లా మండల కేంద్రం రాజోలి గ్రామానికి రెండు కి.మీల దూరంలో వర్షపునీటి బ్యారేజీ మట్టికట్ట బయటి వైపున దాదాపు పది అడుగు లు వెడల్పు, పది అడుగులు లోతులో కుంగిపోయింది. తక్షణమే అప్రమత్తమైన డ్యాం డీఈఈ రాఘురామిరెడ్డి సిబ్బందితో కలసి ఘటన స్థలానికి చేరుకు న్నారు. ఎర్ర గరుసుతో కుంగిన కట్టను మరమ్మ తులు చేశారు. దీని వల్ల ప్రధాన ఆనకట్టకు ఎలాం టి ప్రమాదం లేదని డీఈ ఈ వివరించారు. 2009లో వచ్చిన భారీ వరదలకు డ్యాం ఆనకట్ట అడ్డంగా కోతకు గురైంది. అప్పట్లో మరమ్మతులు చేశారు. శాశ్వత మరమ్మతులు చేయాల్సి ఉంది. రాష్ట్ర విభజన తరువాత అప్పటి టీడీపీ ప్రభుత్వం కేవలం గేట్ల మరమ్మతులకు నీరు-చెట్టు కింద దాదాపు రూ.8.50 కోట్లు నిధులు విడుదల చేసి మరమ్మతులు చేశారు. ఆ తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. శాశ్వత మరమ్మతులకు నిధులు ఇవ్వాలంటూ 2009-10 నుంచి ప్రతి ఏడాది ఇంజనీర్లు ప్రతిపాదనలు పంపుతున్నా ఏ ప్రభుత్వం కూడా పట్టించుకోలేదు. ప్రధాన డ్యాంకు ప్రమాదం లేకపోయినా.. మట్టికట్ట కుంగిపోయి పాలకుల నిర్లక్ష్యాన్ని ఎత్తి చూపుతుంది. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి సుంకేసుల బ్యారేజీ సహా కేసీ కాలువ శాశ్వత మరమ్మతులు చేపట్టాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

## మంత్రాలయంలో పోటెత్తిన భక్తులు

### ప్రసాదాల పంపిణీకి ప్రత్యేక కౌంటర్లు

**మంత్రాలయం, సెప్టెంబరు 1:** మంత్రాలయం రాఘవేంద్ర స్వామి దర్శనార్థం భక్తులు పోటెత్తారు. ఆదివారం సెలవు కావటంతో ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు తరలి వచ్చారు. దీంతో మఠం ప్రాంగణం భక్తులతో కిక్కిరిసింది. అన్నపూర్ణ భోజనశాల, మహాముఖ ద్వారం, మధ్వమార్గ్ కారిడార్, ప్రధాన రహదారులు, రాఘవేంద్ర సర్కిల్, నదితీరం భక్తులతో కోలాహలంగా మారింది. గ్రామ దేవత మంచాలమ్మను దర్శించుకొని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. క్యూలైన్స్‌లు, పరిమళ ప్రసాదం వద్ద భక్తుల సందడిగా మారింది. ఇసుకేస్తే రాలనంత భక్తులు తరలి రావడంతో శ్రీ మఠం ఏఏఓ మాధవశెట్టి, మేనేజర్ ఎస్‌కే శ్రీనివాసరావు పరిమళ ప్రసాదం కొరత రానీయకండా ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. రథోత్సవాల ఊరేగింపులో పాల్గొని భక్తులు పీఠాధిపతులు సుబుధేంద్ర తీర్థుల ఆశీస్సులు పొందారు. ఆదివారం శ్రావణ చతుర్దశి శుభదినాన్ని పురస్కరించుకొని రాఘవేంద్రుని స్వర్ణ పల్లకోత్సవం నిర్వహించారు. కర్ణాటక రాష్ట్ర లా కమిషనర్, రిటైర్డు హైకోర్టు జడ్జి జస్టిస్ నిజంగ జీ నవర్ ఆదివారం రాఘవేంద్ర స్వామిని దర్శించుకున్నారు.

## చెట్టును ఢీకొన్న కారు.. ఆరుగురికి గాయాలు


చెట్టుకు ఢీ కొట్టిన బొలెరా వాహనం

**మహానంది, సెప్టెంబరు 1:** మహానంది మండలం తమ్మడపల్లి గ్రామ సమీపంలోని ప్రధాన మలుపు వద్ద ప్రమాదవశాత్తు బొలేరో కారు వాహనం చెట్టును ఢీ కొట్టింది. ఆదివారం జరిగిన ఈ ప్రమాదంలో కోవెలకుంట్ల మండలం గొట్టిపాడుకు చెందిన ఆరుగురు గాయపడ్డారు. మండలంలోని బుక్కాపురం గ్రామంలోని ఒక శుభకార్యానికి హాజరై తిరిగి వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. బాధితులను నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని మహానంది పోలీసులు పరిశీలించారు.

## గుండెపోటుతో రైతు మృతి

**మద్దికెర, సెప్టెంబరు 1:** మద్దికెర గ్రామంలోని ఎస్సీ కాలనీలో నివసించే రైతు పారా రాజేంద్ర (47) గుండెపోటుతో ఆదివారం మృతి చెందాడు. రాజేంద్ర తన నాలుగెకరాల పొలంలో వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నాడు. రెండెకరాల్లో ఈ ఏడాది ఉల్లి పంటను సాగు చేశాడు. అధిక వర్షాల వల్ల ఆదివారం పంట మొత్తం నీట మునిగింది. దీంతో మనస్తాపానికి గురై నిద్రలోనే మరణించాడు. కుటుంబానికి ప్రభుత్వం ఆర్థిక సాయం అందించాలని సర్పంచ్ బండారు సుహాసిని, పంచాయతీ సలహాదారులు ఆంజనేయులు, జిల్లా ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు పారా రాఘవేంద్ర కోరారు.

# నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

# స్తంభించిన జన జీవనం

● పలు గ్రామాలకు నిలిచిన రాకపోకలు ● నీట మునిగిన పంటలు ● ఇళ్లలోకి చేరిన నీరు ● కూలిన మట్టి మిద్దెలు ● పరిశీలించిన ప్రజాప్రతినిధులు, అధికారులు


నీటి ముంపు బాధితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయసూర్య


పాణ్యం: పొంగి ప్రవహిస్తున్న మునుకుందు వాగు


బండిఆత్మకూరు: మద్దిలేరు వాగు వద్ద రాకపోకలు ఆపివేసిన పోలీసులు


గోస్పాడు: ఉధృతంగా ప్రవహిస్తున్న కుందూ నది

**ఆత్మకూరు, సెప్టెంబరు 1:** ఆత్మకూరు ప్రాంతంలో ఎడతెరిపి లేకుండా భారీ వర్షాలు కురుస్తున్నాయి. శనివారం ఉదయం నుంచి ఆదివారం మధ్యాహ్నం వరకు 135.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. దీంతో పట్టణంలోని లోతట్టు కాలనీల్లో, రోడ్లపై వర్షపు నీరు నిలిచి ప్రజలు తీవ్ర అసౌకర్యానికి లోనయ్యారు. కర్నూలు-గుంటూరు జాతీయ రహదారిపై పలు చోట్ల భారీగా వర్షపు నీరు నిలిచింది. మార్కెట్ యార్డు ప్రాంగణంలో కూడా వర్షపు నీరు చేరింది. పట్టణం మీదుగా ప్రవహించే గుండ్లకమ్మ, పీతురు వాగులు ఉధృతంగా ప్రవహించాయి. పెనుగాలుల ధాటికి పలు చోట్ల చెట్లు నేలకొరిగాయి. తహసీల్దార్ రత్నరాధిక పలు చోట్ల వరదబాధితులను పరామర్శించి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. అలాగే మధ్యాహ్నం కొంతమంది వరద బాధితులకు ఆహార సదుపాయం కల్పించారు.

● ఆత్మకూరు పట్టణ శివార్లలోని భవనాశి నదితో పాటు పడేవాగు ఉప్పొంగి ప్రవహించాయి. దీంతో ఆత్మకూరు నుంచి కొత్తపల్లి మండలంలోని పలు గ్రామాలతో పాటు ఆత్మకూరు మండలంలోని కురుకుంద, కొట్టాలచెరువు గ్రామాల రాకపోకలకు అంతరాయం నెలకొంది. అదేవిధంగా పడేవాగు, భవనాశి నదీ నీరు పట్టణంలోని పశువుల ఆసుపత్రికి వెళ్లే రహదారితో పాటు చుట్టుపక్కల పంటపొలాలను ముంచెత్తాయి. భవనాశి, పడేవాగు వంతెనలపై ప్రజలు వెళ్లకుండా పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు.

● ఆత్మకూరు డీఎస్పీ రామాంజి నాయక్, రూరల్ సీఐ సురేష్‌కుమార్‌రెడ్డి, ఎస్ఐ వెంకటనారాయణ రెడ్డి ఉధృతంగా ప్రవహిస్తున్న ఆయా వాగులను సందర్శించి ప్రజలకు హెచ్చరికలు జారీ చేశారు. నల్లమల ఘాట్ రోడ్డులో శనివారం రాత్రి చెట్టు విరిగిపడి ట్రాఫిక్ సమస్య వాటిల్లడంతో ముందస్తు జాగ్రత్తలతో రహదారిని పర్యవేక్షించారు. భారీ వాహనాలు నల్లమల ఘాట్‌లోకి వెళ్లనివ్వకుండా చర్యలు చేపట్టారు. శ్రీశైలానికి వెళ్లే భక్తులు తమ పర్యటనను వాయిదా వేసుకోవాలని ఆత్మకూరు డీఎస్పీ సూచించారు. టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త రామలింగారెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు శివప్రసాద్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి అబ్దుల్లాపురం బాషా పట్టణంలోని పలు కాలనీల్లో జరుగుతున్న వరద సహాయక చర్యలను పరిశీలించారు. టీడీపీ పట్టణాధ్యక్షుడు వేణుగోపాల్ ఆధ్వర్యంలో వరద బాధితులకు అన్నదానం చేపట్టారు.

**ఆత్మకూరు రూరల్:** ఆత్మకూరు మండలంలో 8.6 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పంటపొలాలు నీటమునిగాయి. దీంతో మండలంలోని రైతులు సాగు చేసిన పంట పొలాల్లోకి నీరుచేరి వరి, మినుము పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. భవనాశివాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో ఆత్మకూరు నుంచి వడ్లరామాపురం, కురుకుంద గ్రామాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దీనికి తోడు వరద రాజ స్వామి ప్రాజెక్టు నుంచి నాలుగు గేట్లను ఎత్తడంతో వరద నీరు వడ్లరామాపురం గ్రామంలోని చిన్న మల్లెలమ్మ, పెద్ద మల్లెలమ్మ చెరువులు నిండుకుండలా మారి వరద నీరు గ్రామంలోకి చేరింది. దీంతో గ్రామంలో లోతట్టు ప్రాంతం వాసులు పలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇందిరేశ్వరం, శ్రీపతిరావుపేట గ్రామ శివార్లలోని ఈదుల వాగు, బందం వాగులు ఉప్పొంగాయి. ముఖ్యంగా సిద్ధాపురం, సంజీవ్‌నగర్ తతండా, వడ్లరామాపురం తదితర గ్రామాల్లో లోతట్టు కాలనీలలో ఇళ్లలోకి వర్షపు నీరు చేరి పలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వరి, మొక్కజొన్న, పత్తి, మినుము పొలాలు నీట మునగడంతో పంటలు దెబ్బతిన్నాయని ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని రాళ్ళవాగు నుంచి సిద్ధాపురం చెరువుకు వరద నీరు చేరుతుండటంతో సిద్ధాపురం చెరువులో నీరు 18 అడుగులకు చేరుకుంది. చెరువులకు చేరడంతో ఆయా ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎంపీడీవో మోహన్‌కుమార్ ఇళ్లలోకి నీరు చేరిన ప్రాంతాలను పరిశీలించారు.

**బండిఆత్మకూరు:** మండలంలోని పలు వాగులు, వంకలు పొంగిపొర్లాయి. మద్దిలేరువాగు, జుర్రాగు, రాళ్ళ వాగు, రాధావంక, జళ్ళవాగులు పొంగి పొర్లి ప్రవహిస్తున్నాయి. బండిఆత్మకూరు, శింగవరం, సోమయాజులపల్లె, ఓంకారం మధ్య మద్దిలేరు వాగు ప్రవాహం రాకపోకలను నిలిపివేసింది. అలాగే జీసీపాలెం వద్ద తెలుగుగంగ కాలువ ఉధృత ప్రవాహం నారాణపురం, శింగవరం, లింగాపురం గ్రామాల మధ్య రాకపోకలను నిలిపివేసింది. పలు గ్రామాల్లోని లోతట్టు వరినాట్ల పొలాలు నీట మునిగాయి. పెద్దదేవళాపురం, బండిఆత్మకూరు జగనన్న కాలనీలలో వరద నీరు చుటుముట్టింది. దీంతో విషపురుగుల బెడదతో ఆయా కాలనీలోని వాసులు బెంబేలెత్తిపోతున్నారు.

**గోస్పాడు:** రెండు రోజులుగా కరుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని రాయపాడు, తేళ్లపురి గ్రామాల మధ్య ఉన్న కుందూనది బ్రిడ్జిపై నీరు ప్రవహిస్తు ప్రమాదకరంగా మారింది. మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అధికారులను, ఆ గ్రామాలలోని టీడీపీ నాయకులతో మాట్లాడి జాగ్రత్తలు తీసుకోవాలని, రాకపోకలు నిలిపివేయాలని ఆదేశించారు. బ్రిడ్జి గండ్లకు గుర్రపుడెక్క ఆకు అడ్డుపడటంతో సర్పంచ్ కాటంరెడ్డి సుధామణి, ఎక్స్‌కవేటర్‌తో తొలగించారు. ఎండీఓ నాగఅనసూయ, తహసీల్దారు షేక్ మొహిద్దీన్, ఎస్ఐ వెంకటప్రసాద్ కుందూ ప్రవాహాన్ని పరిశీలించి ప్రజలను అప్రమత్తం చేశారు. టీడీపీ మండల కన్వీనర్ కాటంరెడ్డి తులసీశ్వరరెడ్డి, రామకృష్ణారెడ్డి కుందూ బ్రిడ్జిపై వాహనాలు తిరగకుండా ట్రాక్టర్‌లను అడ్డుపెట్టి వలంటీర్లుగా టీడీపీ కార్యకర్తలను పెట్టి వాహనదారులకు ప్రమాద హెచ్చరికలు వివరిస్తూ వచ్చే వాహనాలను వెనక్కు పంపించారు. రాత్రి జాగ్రత్తగా ఉండాలని ప్రజలను అప్రమత్తం చేశారు. రాయపాడు, తేళ్లపురి, కూలూరు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

నంద్యాల, శ్రీశైలం, నందికొట్కూరు, పాణ్యం నియోజకవర్గాల్లో ఏకధాటిగా వర్షాలు కురుస్తుండడంతో జనజీవనం ఎక్కడికక్కడే స్తంభించి పోయింది. వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహించడంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. లోతట్టు ప్రాంతాలు జలమయ మయ్యాయి. ఇళ్లలోకి నీరు చేరింది. పంటలు నీట మునిగాయి. మట్టి మిద్దెలు కూలిపోయాయి. వర్షాల కారణంగా తీవ్ర నష్టం కలిగిందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**వెలుగోడు:** రైతులు వర్షాలు కురుస్తుండటంతో తమ పంటలను కాపాడుకునేందుకు జాగ్రత్తలు తీసుకోవాలని ఏవో పవన్‌కుమార్ సూచించారు. మండలంలోని బోయరేవుల, మోతుకూరు గ్రామాల్లో పంటలను పరిశీలించారు.

**మిడుతూరు:** మండలంలోని వీపనగండ్ల, తలముడిపి, రోళ్లపాడు, చింతలపల్లి, చెరుకుచెర్ల, గ్రామాల్లో ఇంటిగోడలు పడిపోయి చెరుకుచెర్ల గ్రామంలో గోడ పడి రెండు గొర్రెలు మృతి చెందగా మరో ఐదు గొర్రెలకు గాయాలు అయ్యాయి. మిడుతూరు గ్రామంలో చాకలి శ్రీనివాసులు అను వ్యక్తి నివాసంలో ఉన్న మట్టి మిద్దె మెత్తు కూలిపోయింది. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణపాయం తప్పింది.

**నందికొట్కూరు రూరల్:** నందికొట్కూరు మండలంలోని వడ్డెమాను గ్రామంలో నాలుగు మట్టిమిద్దెలు కూలిపోయాయి. నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్య కూలిన మట్టి మిద్దెలను పరిశీలించి బాధితులతో మాట్లాడారు. తగిన సహాయ సహకారాలు అందిస్తామన్నారు. అధికారులు కూడా ఎక్కడికక్కడ గ్రామాలలో అందుబాటులో ఉండాలన్నారు. ఎంపీపీ స్కూల్‌లో వసతి కల్పించారు.

**పాములపాడు:** మండలంలోని భవనాశి, శుద్ధవంక వాగులు ఉప్పొంగి ప్రవహిస్తుండటంతో చెలిమిళ్ళ, ఇస్కాల గ్రామాలకు రాకపోకలు నిలచిపోయాయి. బానుముక్కల, చెలిమిళ్ళ గ్రామాలలోని గ్రామ శివార్లలో గల ఎస్సీ కాలనీల్లోకి వరద నీరు చేరి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భవనాశి నది, నిప్పులవాగు, శుద్ధవంక తదితర పరివాహక ప్రాంతాల్లోని ఇస్కాల, వేంపెంట, ఎర్రగూడూరు, బానుముక్కల, కంబాలపల్లి గ్రామాలలో దెబ్బతిన్న పంటలను అధికారులు పరిశీలిస్తున్నారు. పాములపాడు నుంచి ఇస్కాల, చెలిమిళ్ళ గ్రామాలకు వెళ్లే రహదారులలో వాగులు పొంగి పొర్లుతుండటంతో రాకపోకలు నిలిచిపోయాయి. ఇస్కాల, బానుముక్కల గ్రామాలలో లోతట్టు ప్రాంతాలలోకి వర్షపు నీరు చేరింది.

● పాములపాడు, చెలిమిళ్ళ మధ్యలో పొంగి ప్రవహిస్తున్న భవనాశి, ఎద్దులవంక వాగుల ఉధృతిని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య పరిశీలించారు. ప్రవాహం అధికంగా ఉన్నందున రాకపోకలను అనుమతించవద్దని అధికారులకు సూచించారు. ఇస్కాల, చెలిమిళ్ళ, లింగాల గ్రామాలలో నీట మునిగిన మొక్కజొన్న పంటను పరిశీలించారు. అనంతరం బానుముక్కల గ్రామంలోని ఎస్సీ కాలనీని వరదనీరు ముంచెత్తుతుండ టంతో కాలనీలో పర్యటించారు. బాధిత కుటుంబాలతో ధైర్యం చెప్పారు. బాధిత కుటుంబాలకు వసతి, భోజనం, తాగునీటి సౌకర్యాలు కల్పించాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. ఇళ్లను ఖాళీ చేసి అధికారులు ఏర్పాటు చేసిన ప్రాంతానికి వెళ్లాలని ప్రజలకు సూచించారు. టీడీపీ మండల కన్వీనర్ రవీంద్రరెడ్డి, వెంకటేశ్వరరావు, చెల్లె హరినాథరెడ్డి, మధుకృష్ణ , చంద్రశేఖర్, గోవిందు, సురేశ్, కరీంబాషా, మద్దిలేటి, మల్లికార్జున, లింగస్వామి, నాగలక్ష్మిరెడ్డి, రాము, సురేశ్, కలీముల్లా పాల్గొన్నారు.

**కొత్తపల్లి:** భారీ వర్షాలకు మండలంలోని ఆయా గ్రామాల్లోని పంట పొలాలు నీట మునిగాయి. శివపురం, లింగాపురం గ్రామాల మధ్య ఉన్న ఎద్దులేరు వాగు ఉధృతి తగ్గకపోవడంతో పది గ్రామాలకు పగా రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దీంతో జనజీవనం కూడా పూర్తిగా స్తంభించిపోయింది. మండలంలోని దుద్యాల, నందికుంట, శివపురం, కొక్కెరంచ, ముసలిమడుగు, లింగాపురం తదితర గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాలకు వరద నీరు చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. లోతట్టు ప్రాంతాలను నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య ఆదివారం పరిశీలించారు. మండలంలోని దుద్యాల గ్రామంలో గ్రామ శివారులో ఉధృతంగా ఉప్పొంగి ప్రవహిస్తున్న భవనాసి పడేవాగును, దుద్యాలలోని మైనార్టీ కాలనీలో ఇళ్లలోకి వరద నీరు చేరిన లోతట్టు ప్రాంతాలను ఎమ్మెల్యే పరిశీలించారు. నందికుంట గ్రామంలోని కుంట ఉప్పొంగి ప్రవహిస్తుండటంతో రోడ్లు జలమయమైన ప్రాంతాలను ఎమ్మెల్యే సందర్శించారు. శివపురం శివారులోని ఎద్దులేరు వంతెన వాగు నిర్మాణానికై ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి నిధుల మంజూరుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. ఎమ్మెల్యే వెంట నాయకులు నారపురెడ్డి, లింగస్వామిగౌడు, రఫీ, మన్సూర్, జహరుల్లా, చంద్రశేఖర్ యాదవ్, నాగేశ్వరరావు యాదవ్, శేఖర్, మారెన్న, రాదాకృష్ణారెడ్డి ఉన్నారు.


వడ్డెమానులో కూలిన మట్టి మిద్దె

**పాణ్యం:** పాణ్యం బస్టాండు సమీపంలో ఆదివారం తెల్లవారుజామున మహబూబ్‌బాషా ఇంటి పైకప్పు కూలింది. ఆ సమయంలో పక్కనున్న గదిలో నిద్రిస్తున్న నలుగురు వ్యక్తులు ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. వీఆర్వోలు శ్రీనివాసులు, బీరేంద్ర, సచివాలయ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, పంచాయతీ సిబ్బంది రఫీలు ఘటనా స్థలాన్ని పరిశీలించి బాధితులకు 20 కిలోల బియ్యం అందజేశారు. గృహ నిర్మాణానికి సంబంధిత అధికారులకు సిఫారసు చేస్తామన్నారు. టీడీపీ నాయకులు ఖాదర్‌బాషా ఉన్నారు. ఎస్సార్బీసీ బ్లాకులకు భారీగా సాగునీరు చేరడంతో కాలువ గట్టు కోతకు గురై నీరు పంట పొలాల్లోకి చేరింది. కాలువ గట్టు కోతకు గురైనా మరమ్మతులు చేపట్టకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడినట్లు స్థానిక రైతులు ఆరోపిస్తున్నారు. బ్లాకుల గట్లు శిథిలావస్థకు చేరడంతో నీరు పాణ్యం జూటూరు రహదారిపై పారి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. గగ్గటూరు సమీపంలోని మునుకుందువాగు ప్రమాదకరంగా మారింది. ప్రముఖ శైవక్షేత్రమైన సుబ్బరాయుని కొత్తూరుకు భక్తులు నంద్యాల ప్రాంతం నుంచి వెళ్లడానికి ఈవాగు ఆటంకంగా మారింది. అలాగే కొత్తూరు, నందివర్గం, ప్రాంతాలనుంచి నంద్యాలకు వెళ్లడానికి వాహనాలకు అంతరాయమేర్పడుతోంది.

● కుందూ పరివాహక ప్రాంతాలలోని తొగర్చేడు, మద్దూరు, అనుపూరు గ్రామాల పరిధిలోని కుందూ ప్రాంతాలను తహసీల్దార్ నరేంద్రనాథరెడ్డి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో నాలుగు మిద్దెలు పాక్షికంగా దెబ్బతిన్నాయన్నారు. ఆర్ఐ మహేశ్వరరెడ్డి, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. విద్యుత్ వినియోగదారులు విద్యుత్ వినియోగం పట్ల అప్రమత్తంగా ఉండాలని విద్యుత్ శాఖ అధికారి సుందరరాజు సూచించారు.

**గడివేముల:** వర్షాల వల్ల గ్రామాల్లోని వీధులు జలమయమయంగా మారాయి. లోతట్టు పంట పొలాలు నీట మునిగాయి. రెండు రోజుల పాటు ఎడతెరిపి లేని వర్షాలు కురవడంతో గడివేముల, బూజనూరు, బిలకలగూడురు గ్రామాల్లో మట్టి మిద్దెలు కూలేలా ఉన్నాయి. కొర్రపోలూరు గ్రామ సమీపంలో ప్రమాదకరంగా మారిన ఎస్ఆర్‌బీసీ బ్రిడ్జిని ఆదివారం ఈఈ వేణుగోపాల్‌రెడ్డి పరిశీలించారు. కేసీ కెనాల్‌లో చెత్తా చేదారం చేరడంతో నీళ్లు కాలువపై నుంచి పారి ఎస్ఆర్‌బీసీ బ్రిడ్జికి ఒక వైపు ఉన్న మట్టి కట్ట కోతకు గురి చేసింది. మట్టి కట్ట లేకపోవడంతో ఎస్ఆర్‌బీసీ బ్రిడ్జిపై రాకపోకలు సాగించేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో కొర్రపోలూరు సర్పంచ్ మాలిక్‌బాషా కోతకు గురైన ఎస్ఆర్‌బీసీ బ్రిడ్జి సమస్యను ఎమ్మెల్యే గౌరు చరిత దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు ఎస్ఆర్‌బీసీ ఈఈ వేణుగోపాల్‌రెడ్డి ఎస్ఆర్‌బీసీ బ్రిడ్జి వద్ద కోతకు గురైన ప్రాంతాన్ని పరిశీలించారు. మట్టి కట్టను వేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కొర్రపోలూరు నాయకులు, రైతులు ఉన్నారు.


ఆత్మకూరు రూరల్: సంజీవ్ నగర్ తండాలో నీట మునిగిన వరి పంట


పాములపాడు, చెలిమిళ్ల మధ్య ప్రవహిస్తున్న నీరు


గడివేముల: మట్టికట్టను పరిశీలిస్తున్న ఎస్సార్బీసీ ఈఈ


వెలుగోడు: పంటను పరిశీలిస్తున్న ఏవో

## 'పర్యావరణ పరిరక్షణతోనే మానవ మనుగడ'


మహానందిలో మొక్కను నాటుతున్న ఆలయ ఈవో శ్రీనివాసరెడ్డి

**మహానంది, సెప్టెంబరు 1:** పర్యావరణ పరిరక్షణతోనే మానవ మనుగడ సాధ్యమని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పరిరక్షించాలని మహానంది ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి అన్నారు. వన మహోత్సవం పురస్కరించుకొని మహానంది దేవస్థానం ప్రధాన కార్యాలయం ముందు భాగంలో ఆదివారం వివిధ రకాల మొక్కలు నాటారు. అనంతరం మొక్కలు పెంచడం వల్ల భవిష్యత్తులో కలిగే లాభాల గురించి ఈవో సిబ్బందికి వివరించారు. కార్యక్రమంలో ఆలయ ఏఈవోలు ఎర్రమల్ల మధు, వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు అధికారులతో ఎమ్మెల్యే సమావేశం

**పాణ్యం, సెప్టెంబరు 1:** నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలపై మండల స్థాయి అధికారులతో ఎమ్మెల్యే గౌరు చరిత అత్యవసర సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో దస్తగిరి ఆదివారం తెలిపారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా తమ శాఖకు సంబంధించిన పూర్తి సమాచారంతో మధ్యాహ్నం 12 గంటలకు ఎంపీడీవో కార్యాలయంలో హాజరు కావాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు హాజరు కావాలన్నారు.

**గడివేముల:** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావం వల్ల కురుస్తున్న వర్షాల వల్ల జరిగిన నష్టాలపై సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత సమీక్ష నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు తమ శాఖ పరిధిలో ఉన్న పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరు కావాలని అన్నారు. వర్షాల వల్ల జరిగిన నష్టాలపై పూర్తి నివేదిక ఇవ్వాలన్నారు.

## తెలంగాణ మద్యం పట్టివేత


**నందికొట్కూరు రూరల్, సెప్టెంబరు 1:** తెలంగాణ రాష్ట్రం నుంచి ఏపీలోకి అక్రమంగా తెలంగాణ మద్యం బాటిళ్లను బైక్‌పై తీసుకొస్తుండగా పోలీసులు దాడులు నిర్వహించి స్వాధీనం చేసుకున్నారు. బ్రాహ్మణకొట్కూరు ఎస్ఐ తిరుపాలు వివరాలివీ.. ముచ్చుమర్రి గ్రామానికి చెందిన చందమాల తిరుపాలు, ఏకదంతాలు శాతనకోట వద్ద గల కేసీ కెనాల్ కట్టపై మద్యం రవాణా చేస్తుండగా 157 మద్యం బాటిళ్లను పట్టుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి బైక్‌ను సీజ్ చేశామని ఎస్ఐ చెప్పారు. రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం, ఎస్ఐ తిరుపాలు, పోలీసు సిబ్బంది ఉన్నారు.

## మైనార్టీలకు అండగా ప్రభుత్వం: మంత్రి


మంత్రి ఫరూక్‌ను సన్మానిస్తున్న మైనార్టీలు

**నంద్యాల(రూరల్), సెప్టెంబరు 1:** మైనార్టీలకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. నంద్యాల సాయిబాబా నగర్‌లోని కుబ్రా మసీద్ ఫంక్షన్ హాలులలో ఆదివారం మంత్రి ఫరూక్ అభినందన సభ నిర్వహించారు. నంద్యాల ఇమాముల సంఘం అధ్యక్షుడు అంజాద్‌బాషా అధ్యక్షతన కార్యక్రమం జరిగింది. ఫరూక్‌కు మత పెద్దలు, కుబ్రా మసీదు కమిటీ ప్రతినిధులు చిత్ర పటాన్ని అందజేసి సన్మానించారు. మంత్రి మాట్లాడుతూ మైనార్టీల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్, ఇమాముల సంఘం నాయకులు పాల్గొన్నారు.

## ఐక్యంగా ముందుకు సాగాలి: బైరెడ్డి


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి

**నంద్యాల (రూరల్ ), సెప్టెంబరు 1:** రెడ్ల సామాజిక వర్గీయులు ఐక్యంగా ముందుకు సాగాలని మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖరరెడ్డి పిలుపునిచ్చారు. నంద్యాలలోని ఓ ఫంక్షన్ హాలులో ఆదివారం రెడ్ల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. బైరెడ్డి మాట్లాడుతూ ప్రపంచ దేశాల్లోని రెడ్డి సామాజిక వారిని ఐక్యం చేసి భవిష్యత్తు తరాలకు ఉజ్వల భవిష్యత్తును అందించే విధంగా కృషి చేస్తామని అన్నారు. కార్యక్రమంలో రామకృష్ణ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ రామకృష్ణారెడ్డి, ఎస్వీఆర్ విద్యా సంస్థల చైర్మన్ వెంకటరామి రెడ్డి, రెడ్డి సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రతాప రెడ్డి, సీనియర్ న్యాయవాది హేమలత, శ్రీధర్‌రెడ్డి, జనార్ధనరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా పల్లకీ ఉత్సవం

**శ్రీశైలం, సెప్టెంబరు 1:** శ్రీశైల మహాక్షేత్రంలో లోకకల్యాణార్థం ఆదివారాన్ని పురస్కరించుకొని స్వామి, అమ్మవార్లకు పల్లకీ ఉత్సవం ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో నిర్వహించిన ఉత్సవ కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహా గణపతికి ప్రత్యేక పూజలు చేశారు. తరువాత స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు శాస్త్రోక్తంగా షోడశోపచార పూజలు నిర్వహించి పల్లకీలో ఆశీనులనుజేసి అలమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఘనంగా ఉత్సవాన్ని నిర్వహించారు.

## 'రైతు సమస్యలు పరిష్కరించాలి'


మాట్లాడుతున్న రైతు సంఘం నాయకుడు వెంకటేశ్వర్లు

**జూపాడుబంగ్లా, సెప్టెంబరు 1:** రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిష్కరించాలని ఏపీ రైతు సంఘం జిల్లా నాయకుడు వెంకటేశ్వర్లు డిమాండు చేశారు. సెప్టెంబరు 1ని రైతుల డిమాండ్ డేగా ప్రకటించాలని రైతు సంఘం ఆధ్వర్యంలో జెండాను ఆవిష్కరించారు. బీజేపీ ప్రభుత్వం రైతులకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, రైతుల కోసం తెచ్చిన నల్లచట్టాలను రద్దు చేయాలని డిమాండు చేశారు. నిత్యావసర సరుకులపై జీఎస్టీ పేరుతో పన్ను పెంచడం దారుణమన్నారు. కార్పొరేట్లకు బీజేపీ ప్రభుత్వం ఊడిగం చేస్తోందని మండిపడ్డారు. స్మార్టుమీటర్లను బిగించ కూడదని, బంజరు భూములన్నింటికీ పట్టాలు ఇవ్వాలని, 60 సంవత్సరాలు నిండిన రైంతాంగానికి రూ.10 వేలు పింఛను ఇవ్వాలని డిమాండు చేశారు. నాయకులు నరసింహ, ఏసన్న, లింగన్న, ప్రసాద్, తిరుపాలు పాల్గొన్నారు.

**నందికొట్కూరు:** కేంద్ర ప్రభుత్వం రైతుల డిమాండ్లు పరిష్కరించాలని, సెప్టెంబరు 1వ తేదీని రైతాంగ డిమాండు డే గా ప్రకటించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి జి.సోమన్న డిమాండు చేశారు. నందికొట్కూరులో ఆయన మాట్లాడుతూ రైతుల రుణమాఫీ చేయాలని, విద్యుత్ చట్టసవరణ బిల్లును ఉపసంహరించి స్మార్ట్ మీటర్ల బిగింపును నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. చుక్కల భూములకు బంజరు భూములకు పట్టాలు ఇవ్వాలని కోరారు. సిద్దేశ్వరం అలుగు నిర్మాణం గోరుకల్లు అలగనూరు రిజర్వాయర్లను గరిష్ఠ నీటి సామర్థంతో నింపాలన్నారు. 60ఏళ్ల నిండిన ప్రతి రైతుకు కేంద్ర ప్రభుత్వం రూ.10 వేలు పెన్షన్ సౌకర్యం కల్పించి రైతులను ఆదుకోవాలని సోమన్న కోరారు. రైతు సంఘం నాయకులు వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

## మహానందిలో రాహుకేతు పూజలు


రాహుకేతు పూజలు నిర్వహిస్తున్న భక్తులు

**మహానంది, సెప్టెంబరు 1:** మాస శివరాత్రి పురస్కరించుకొని మహానంది క్షేత్రంలో ఆదివారం వేదపండితులు రాహుకేతు పూజలు నిర్వహించారు. భక్తుల చేత రాహుకేతు మంటపంలో ఉదయం గణపతి పూజ, అభిషేకంతోపాటు రాహుకేతు పూజలను వేదమంత్రాలతో జరిపారు. కార్యక్రమంలో ఆలయ వేదపండితులు హనుమంత్‌శర్మ, అంజనేయ శర్మ తదితరులు పాల్గొన్నారు.

## సీపీఎస్‌ను రద్దు చేయాలి: ఏపీటీఎఫ్


మోకాళ్లపై నిరసన వ్యక్తం చేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

**నంద్యాల (రూరల్ ), సెప్టెంబరు 1:** ఉద్యోగ, ఉపాధ్యాయులకు సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రామచంద్రారెడ్డి, శివయ్య డిమాండ్ చేశారు. సెప్టెంబరు 1వ తేదీని పెన్షన్ విద్రోహ చీకటి దినంగా అభివర్ణిస్తూ నంద్యాలలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఏపీటీఎఫ్ నాయకులు మోకాళ్లపై నిరసన వ్యక్తం చేశారు. నాయకులు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ శక్తులకు తలొగ్గి ఉపాధ్యాయ, ఉద్యోగ, కార్మికుల పట్ల పెన్షన్ విధానాలలో నిర్లక్ష్యం వహిస్తున్నాయని విమర్శించారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంపై కాలయాపన సరికాదన్నారు. జాకీర్ హుసేన్, రాష్ట్ర కౌన్సిలర్ సుకుమాంబ కుమారి, శ్రీనివాసులు, పుల్లయ్య, వీరేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నందవరం ఆలయానికి వెండి బకెట్ విరాళం


చౌడేశ్వరీ మాతకు వెండి బకెట్‌ను విరాళంగా అందిస్తున్న భక్తులు

**బనగానపల్లె, సెప్టెంబరు 1:** మండలంలోని ప్రముఖ శక్తి క్షేత్రమైన నందవరం చౌడేశ్వరీ మాత ఆలయానికి రాజంపేట వాసులు వెండి బకెట్‌ను ఆదివారం ఆలయ ఈవో కామేశ్వరమ్మ, పూజారులకు విరాళంగా అందించారు. రాజంపేటకు చెందిన భార్గవ్ మనోహర్ రూ.52,254 విలువ గల 580.600 గ్రాముల వెండి బకెట్‌ను విరాళంగా అందించారు. దాతలకు ఆలయ పూజారులు తీర్థ ప్రసాదాలు అందించారు.

## రైతుల సమస్యలు పట్టించుకోరా?


బనగానపల్లెలో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

**బనగానపల్లె, సెప్టెంబరు 1:** కేంద్ర ప్రభుత్వం రైతులకు అన్యాయం చేస్తోందని బనగానపల్లె సీపీఐ నాయకులు విమర్శించారు. ఆదివారం బనగానపల్లెలో సెప్టెంబరు 1వ తేదీని రైతాంగ డిమాండ్ డేగా ప్రకటించిన సందర్భంగా సీపీఐ జెండాను ఏపీ రైతు సంఘం నంద్యాల జిల్లా నాయకులు ఆవుల సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. సీపీఐ నాయకులు సంజీవులు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను విస్మరించిందన్నారు. వ్యవసాయం, పరిశ్రమలు, గనులు, విద్యుత్, ఆటవీ సంపదను కార్పొరేట్ కంపెనీలకు అప్పగించిందన్నారు. కృష్ణాజలాల పంపిణీలో రాష్ట్రానికి నష్టం చేస్తుందని విమర్శించారు. సత్వర సమస్యల పరిష్కారానికి రైతాంగం డిమాండ్స్ డేగా ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో ఏపీ ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి శివయ్య, ఏఐటీయూసీ జిల్లా సెక్టర్ బాలకృష్ణ, శివనాగయ్య, మాములు, రవి, హుసేని గంగన్న, చంద్రనాగేశ్వరరెడ్డి, వెంకటేశులు, సుబ్బరాయుడు, బాలన్న పాల్గొన్నారు.

## 4న మండల సర్వసభ్య సమావేశం

**కోవెలకుంట్ల, సెప్టెంబరు 1 :** కోవెలకుంట్లలోని మండల పరిషత్ కార్యాలయంలో 4న ఎంపీపీ భీమిరెడ్డి రమాదేవి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సయ్యదున్నీసా తెలిపారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ బుధవారం సమావేశానికి జడ్పీటీసీ సభ్యులు, ఎంపీటీసీలు, మండల కోఆప్షన్ మెంబర్లు, సర్పంచ్‌లు, అన్ని శాఖల అధికారులు హాజరు కావాలన్నారు.

## విద్యుత్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**కొలిమిగుండ్ల, సెప్టెంబరు 1 :** వర్షాల నేపథ్యంలో విద్యుత్ పట్ల ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని విద్యుత్ శాఖ ఏఈ ప్రసన్న అంజనేయులు పేర్కొన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ తడి చేతులతో విద్యుత్ పరికరాలను ముట్టుకోవద్దని, రైతులు పొలాల్లో మోటార్లు ఆన్ చేసే సమయంలో జాగ్రత్త వహించాలని, అవసరమైతే చేతులకు ప్లాస్టిక్ బ్లౌజులు ఉపయోగించాలని, తడి చేతులతో విద్యుత్ స్తంభాలు, ఇంట్లో విద్యుత్ పరికరాలు ముట్టుకోవద్దని సూచించారు.

## టీకాలు సద్వినియోగం చేసుకోవాలి

**కొలిమిగుండ్ల, సెప్టెంబరు 1 :** మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పాడి రైతులు పశువుల వ్యాధి నివారణ టీకాలను సద్వినియోగం చేసుకోవాలని పశు వైద్యాధికారి డా. పద్మావతి పేర్కొన్నారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ పశువులకు వచ్చే నోటి పూత వ్యాధి, పాదంలో వచ్చే వ్యాధుల నివారణ టీకాలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. పశువుల్లో వచ్చే వ్యాధుల పట్ల పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

## 'పాత పెన్షన్ విధానం అమలు చేయాలి'


చాగలమర్రి హైవే రహదారిలో ఆందోళన చేస్తున్న ఎస్టీయూ నాయకులు

**చాగలమర్రి, సెప్టెంబరు 1:** కొత్త పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి శివశంకర్, మండల అధ్యక్షుడు మస్తాన్ బాషా డిమాండ్ చేశారు. ఆదివారం చాగలమర్రి గ్రామ సమీపంలోని హైవే రహదారి వద్ద ఆందోళన చేపట్టారు. జీవో నంబర్ 117ను రద్దు పరిచి ప్రాథమిక విద్యను మెరుగు పరచాలని కోరారు. పాఠశాల గ్రాంట్‌లు మంజూరు కాకపోవడంతో ఉన్నత, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎంలు ఇబ్బందులు పడుతున్నారని, గ్రాంట్ మంజూరు చేయాలని అన్నారు. ఎస్టీయూ ప్రధాన కార్యదర్శి సుబ్బారావు, ఆర్థిక కార్యదర్శి మాబుహుసేన్, మండల ఉపాధ్యక్షుడు వెంకటప్రసాద్, ఓపీఎస్ మండల కన్వీనర్ ఎన్. ప్రసాద్, పుట్టాలయ్య, సురేషప్ప తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి


కలుగొట్లపల్లె వద్ద వక్కిలేరును పరిశీలిస్తున్న ఎస్‌ఐ రమేష్‌రెడ్డి

**చాగలమర్రి, సెప్టెంబరు 1:** ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల పట్ల గ్రామాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ రమేష్‌రెడ్డి సూచించారు. ఆదివారం మండలంలోని కలుగొట్లపల్లె, బ్రాహ్మణపల్లె గ్రామాల వద్ద వక్కిలేరు వంతెనలపై పొంగి ప్రవహిస్తుండటంతో వరద నీటిని పరిశీలించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ మరో రెండు రోజులు కూడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అన్నారు. కుందూ, వక్కిలేరు వాగు పరిసర గ్రామాలైన ప్రజలు నది దాటే ప్రయత్నం చేయరాదని, కూలిపోయే మట్టిమిద్దెల్లో నివాసం ఉండరాదని సూచించారు.

## వైభవంగా శ్రావణ మాస పూజలు


చాగలమర్రి కోదండ రామాలయంలో పూజలు చేస్తున్న మహిళలు

**చాగలమర్రి, సెప్టెంబరు 1:** చాగలమర్రి గ్రామంలోని కోదండరామ, పట్టాభిరామ, గంగమ్మ, చాగలమ్మ దేవాలయాల్లో ఆదివారం శ్రావణమాస పూజలు వైభవంగా నిర్వహించారు. మహిళలు సామూహికంగా ప్రత్యేక పూజలు చేశారు. కోదండరామాలయంలో సీతారాములకు జల, పాలాభిషేకాలు, వడిబియ్యం కార్యక్రమం నిర్వహించారు. గంగమ్మ ఆలయంలో మహిళలు దీపాలు వెలిగించి దీపోత్సవం చేశారు.

## రైతులు అప్రమత్తంగా ఉండాలి


వలసల గ్రామంలో పంట పొలాలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి అబ్దుల్ షఫీ

**డోన్(రూరల్), సెప్టెంబరు 1:** అల్పపీడన ప్రభావంతో మరో రెండు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయాధికారి అబ్దుల్ షఫీ అన్నారు. వలసల గ్రామంలో పంట పొలాలను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పొలాల్లో వర్షంనీరు నిల్వ లేకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వర్షం నీరు పంట పొలాల్లో అధికంగా నిల్వ ఉంటే పంటలు దెబ్బతింటాయన్నారు. పంట పొలాలు నీట మునిగి నష్టం వాటిల్లితే రైతులు తమ దృష్టికి తప్పనిసరిగా తీసుకురావాలని కోరారు.

# వాన కష్టాలు

● పొంగి పొర్లిన వాగులు, వంకలు ● రాకపోకలకు అంతరాయం ● ఇబ్బంది పడిన ప్రజలు


రాజోలి ఆనకట్ట వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న కుందూ నది

**చాగలమర్రి, సెప్టెంబరు 1:** బంగాళాఖాతం అల్పపీడన ప్రభావంతో రెండు రోజుల నుంచి మండలంలో ఎడతెరిపి లేని వర్షాలు కురవడంతో భవనాశి, వక్కిలేరు, కుందూలో వరద నీటి ఉధృతి తగ్గలేదు. ఆదివారం మోస్తరు వర్షం కురిసింది. ఈ వర్షంతో కలుగొట్లపల్లె, బ్రాహ్మణపల్లె, అడ్డవాగు, భవనాశి వంతెనలపై వరద నీరు ప్రవహించడంతో రాకపోకలు స్తంభించాయి. రాజోలి ఆనకట్ట సమీపంలో కుందూనది 14 వేల క్యూసెక్కులతో వరద నీరు ఉధృతంగా ప్రవహించింది. పత్తి, మినుము, మొక్కజొన్న, వరి పంటలు నీటమునిగాయి.

### నీటి కుంటలుగా రహదారులు

మండల కేంద్రంలోని గోపాయపల్లెకు వెళ్లే రహదారి నీటి కుంటను తలపిస్తున్నది. రహదారి వెంట రాకపోకలు స్తంభించి పోయాయి. వర్షపు నీరు రోడ్డుపై నిలిచి పోయింది. దీంతో రైతులు, కూలీలు, వాహనదారులు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొత్తపల్లె, డి.వనిపెంట, ఓజీ తండా, నేలంపాడు నుంచి గొట్లూరు గ్రామాలకు వెళ్లే రహదారులు నీటి కుంటలను తలపిస్తున్నాయి.

### పొంగి ప్రవహిస్తున్న వక్కిలేరు

**రుద్రవరం:** మండలంలో వక్కిలేరు వాగు పొంగి ప్రవహిస్తున్నది. ఆదివారం చిలకలూరు గ్రామ ప్రజలకు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పేరూరు వక్కిలేరు వాగు నేల వంతెనపై పొంగి ప్రవహించింది. మండలంలోని మందలూరు గ్రామ సమీపంలో 19వ గంగ బ్లాక్ ఛానెల్ పొంగి ప్రవహించడంతో పంట పొలాలు నీటమునిగాయి.

● మండలంలో గ్రామ రెవెన్యూ అధికారులను అప్రమత్తం చేసినట్లు తహసీల్దారు మల్లికార్జునరావు ఆదివారం తెలిపారు. వాగులు పొంగిన చిలకలూరు గ్రామ సమీపంలోవాగు వద్దన ప్రజలు అటు వెళ్లకుండా కంప ఏర్పాటు చేసినట్లు తహసీల్దారు తెలిపారు.

### ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు

**కోవెలకుంట్ల:** మండలంలోని వల్లంపాడు-లింగాల గ్రామాల మధ్య ఉన్న కప్పలవాగు, లింగాల - గుండుపాపల మధ్య ఉన్న వాగు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ప్రజలు గ్రామాల నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లవద్దని తహసీల్దారు పవన్‌కుమార్‌రెడ్డి హెచ్చరించారు. ఆదివారం లింగాల, వల్లంపాడు గ్రామాల మధ్య ఉన్న వాగులను తహసీల్దారు పరిశీలించారు. ఎవరైనా మట్టి మిద్దెల్లో నివాసముంటే వారు గ్రామ పంచాయతీ భవనాల్లో ఉండాలని సూచించారు.

### వర్షాలకు దెబ్బతింటున్న పంటలు

**ప్యాపిలి:** గత మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు లోతట్టు పొలాల్లోని పంటలు నీట మునిగాయి. ముఖ్యంగా టమోట పంటకు వర్షాల కారణంగా వివిధ తెగుళ్ల సోకడంతో కాయలు దెబ్బతింటున్నాయి. ప్యాపిలి, కటచట్ల, రంగాపురం, నల్లబల్లి, వెంగళాంపల్లి, పోతుదొడ్డి, పెద్దపూదిళ్ల తదితర గ్రామాల్లో టమోట పంట అధికంగా దెబ్బతినడంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు.

**డోన్(రూరల్):** డోన్ ప్రాంతంలో ఆదివారం తేలికపాటి వర్షాలు కురిసాయి. ఆదివారం డోన్ మండల వర్షపాతం 8.4 మి.మీలుగా నమోదైంది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో పట్టణంలోని ప్రధాన రోడ్లు, వీధులన్నీ చిత్తడి చిత్తడిగా మారాయి. ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచనలు జారీ చేశారు.

**ఉయ్యాలవాడ:** కుందూనది తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దారు శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం హరివరం, ఉయ్యాలవాడ, బోడెమ్మనూరు గ్రామాల సమీపంలో ఉన్న కుందూ వంతెనల వద్ద నీటి ప్రవాహాన్ని ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కుందూనది నీటి ప్రవాహం ఎక్కువగా ఉందన్నారు. అందువల్ల కుందూ తీర లోతట్టు ప్రాంతంలో ఉన్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. బోడెమ్మనూరు గ్రామ సమీపంలో రోడ్డుపై నీరు ప్రవహిస్తుండటంతో అక్కడ వీఆర్వోలను కాపలా ఉంచామన్నారు. విద్యుత్ మోటార్ల వద్ద అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల వీఆర్వోలు ఓబులేసు, దాదాసాహెబ్, రామానాయుడు తదితరులు పాల్గొన్నారు.


రుద్రవరం మండలం చిలకలూరు గ్రామ సమీపంలో పొంగి ప్రవహిస్తున్న వక్కిలేరు వాగు


ప్యాపిలి మండలంలోని నల్లబల్లిలో దెబ్బతిన్న టమోటా పంట


చాగలమర్రి నుంచి గోపాయపల్లెకు వెళ్లే రహదారి దుస్థితి


చాగలమర్రి మండలం కలుగొట్లపల్లె వద్ద వక్కిలేరుపై పొంగి ప్రవహిస్తున్న వరద నీరు


కప్పలవాగును పరిశీలిస్తున్న తహసీల్దారు పవన్‌కుమార్ రెడ్డి


ఉయ్యాలవాడ: కుందూ నది ప్రవాహాన్ని పరిశీలిస్తున్న తహసీల్దారు శ్రీనివాసులు

## గోపాలుడికి గ్రామోత్సవం


పేరుసోమలలో శ్రీకృష్ణ భగవానుడి గ్రామోత్సవం


జలదుర్గంలో కృష్ణుడి విగ్రహాన్ని ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

**సంజామల, సెప్టెంబరు 1:** పేరుసోమల గ్రామంలో కొలువుదీరిన గోపాలుడికి గ్రామోత్సవం నిర్వహించారు. త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞానవేదిక పేరుసోమల కమిటీ ఆధ్వర్యంలో గత నెల 26న శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకొని గ్రామంలో శ్రీకృష్ణుడిని కొలువుదీర్చారు. 7రోజుల పాటు బాలగోపాలుడికి పూజలు చేసి ఆదివారం గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యుడు సురేష్, శేఖర్, ప్రభాకర్ రెడ్డి, దస్తగిరి రెడ్డి, మల్లేష్ , ఉపేంద్ర పాల్గొన్నారు.

**ప్యాపిలి:** మండలంలోని జలదుర్గం గ్రామంలో ఆదివారం కృష్ణుడి విగ్రహ గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. త్రేత సిద్ధాంతం ప్రబోధానంద సేవా సమితి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సేవాసమితి సభ్యులు రామక్రిష్ణ, విశ్వనాథ్, పుల్లయ్య, జమాల్‌బాషా, తిరుపాల్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## లింగమయ్య స్వామికి ప్రత్యేక పూజలు

**రుద్రవరం, సెప్టెంబరు 1:** మండలంలోని ముత్తలూరు గ్రామ సమీపంలో కొలువుదీరిన లింగమయ్య స్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు అభిషేకం చేసి పూజలు ప్రారంభించారు. వివిధ గ్రామాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామికి నైవేద్యం సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు.

### గ్రామ దేవతలకు..

కొండమాయపల్లె, రుద్రవరం గ్రామాల్లో ఆదివారం గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. పెద్దమ్మ మారెమ్మ అమ్మవార్లకు చీరలు బోనాలు సమర్పించారు.

## గౌడ సంఘం అధ్యక్షుడి ఎన్నిక ఏకగ్రీవం

**ఆళ్లగడ్డ, సెప్టెంబరు 1:** ఆళ్లగడ్డ తాలుకా గౌడ సంఘం నూతన అధ్యక్షుడిగా అహోబిలం ఎస్ఎల్ చిన్న రమణ ఎన్నిక ఏకగ్రీవమైంది. ఆళ్లగడ్డ పట్టణంలోని శ్రీకోదండ రామ దేవాలయంలో ఆదివారం తాలుకా కార్యవర్గ సమావేశం జరిగింది. రమణ మాట్లాడుతూ గౌడ సంఘం అభివృద్ధికి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

## బేతంచెర్లలో గుండె పరీక్షలు


వైద్య పరీక్ష నిర్వహిస్తున్న వైద్యులు

**బేతంచెర్ల, సెప్టెంబరు 1:** పట్టణంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో విజయవాడ స్వర్ణ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వారి సౌజన్యంతో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్యశిబిరాన్ని సీఐ వెంకటేశ్వరరావు ప్రారంభించారు. 140 మందికి గుండె పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు మురళీకృష్ణ, అధ్యక్ష కార్యదర్శులు మధు సుధాకర్ రెడ్డి, రాఘవేంద్రరాజు, మనోహర్ రెడ్డి, నైస్ క్లబ్ సభ్యులు సుదర్శన్, ధనుంజయ పాల్గొన్నారు.

## ఫైర్‌మెన్‌కు సన్మానం


ఫైర్‌మెన్‌ను సన్మానించిన అగ్నిమాపక సిబ్బంది, జనసేన నాయకులు

**డోన్(రూరల్), సెప్టెంబరు 1:** డోన్ అగ్నిమాపక కేంద్రంలో ఫైర్‌మెన్‌గా పని చేస్తున్న మహేశ్వరరెడ్డికి ఆదివారం సన్మానించారు. రాష్ట్ర ఫైర్ సర్వీస్ అసోసియేషన్ ఎన్నికల్లో రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన సందర్భాన్ని పురస్కరించుకుని ఫైర్‌మెన్ మహేశ్వరరెడ్డికి సన్మాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ నాయకులు ఆలా మోహన్ రెడ్డి, అగ్నిమాపక అధికారి రంగస్వామి గౌడు, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

## నాటు సారా, మట్కా నిర్వహణపై నిఘా: సీఐ

**కొలిమిగుండ్ల, సెప్టెంబరు 1 :** మండలంలోని వివిధ గ్రామాల్లో నాటు సారా విక్రయాలు, మట్కా, పేకాట నిర్వహణపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు కొలిమిగుండ్ల సీఐ రమేష్‌బాబు పేర్కొన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ నాటుసారా విక్రయాలపై ప్రతి రోజు తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.


## అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

**డోన్(రూరల్), సెప్టెంబరు 1:** ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని పట్టణ సీఐ ఇంతియాజ్ బాషా హెచ్చరించారు. ఆదివారం పట్టణ పోలీస్ స్టేషన్‌లో రౌడీషీటర్లకు ఆయన కౌన్సిలింగ్ ఇచ్చారు. పట్టణంలో గంజాయి, మట్కా, పేకాట వంటి అసాంఘిక కార్యకలాపాలను సహించే ప్రసక్తే లేదన్నారు. పట్టణంలో అసాంఘిక కార్యకలాపాలపై పోలీసుల ప్రత్యేక నిఘా ఉంచామని, ఇలాంటి పనులకు పాల్పడే వారు తమ పద్ధతులు మార్చుకోవాలని హెచ్చరించారు.

## పుట్టాలమ్మకు పూజలు

**ఆళ్లగడ్డ, సెప్టెంబరు 1:** ఆళ్లగడ్డ మండలంలోని ఆర్ క్రిష్ణాపురంలో వెలసిన రామతీర్థం పుట్టాలమ్మ క్షేత్రంలో అమ్మవారి దర్శనం కోసం భక్తులు పోటెత్తారు. శ్రావణ మాసం చివరి ఆదివారం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించారు. భక్తులకు ఈవో సాయి జయచంద్రారెడ్డి అన్నదానం చేశారు.

# చంద్రబాబు నాయుడు ప్రజల మనిషి





● చంద్రబాబు తొలిసారి ముఖ్యమంత్రి అయి 30 ఏళ్లు పూర్తి ● అభినందనలు తెలిపిన టీడీపీ నాయకులు


మాట్లాడుతున్న టంగుటూరు శ్రీనయ్య, వంగల పరమేశ్వరరెడ్డి


మాట్లాడుతున్న కొలిమిగుండ్ల నాయకులు

**బనగానపల్లె, సెప్టెంబరు 1:** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రజల అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్నారని టీడీపీ నంద్యాల జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు టంగుటూరు శ్రీనయ్య, తెలుగుదేశం పార్టీ యువనాయకుడు వంగల పరమేశ్వరరెడ్డి అన్నారు. ఆదివారం వారు మాట్లాడుతూ చంద్రబాబునాయుడు సీఎం హోదాలో బాధ్యతలు చేపట్టి 30 ఏళ్లు కావడం హర్షిందగ్గ విషయమన్నారు. ఏపీకి రెండు సార్లు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రెండు సార్లు సీఎంగా బాధ్యతలు చేపట్టిన ఏకైక నాయకుడు సీఎం చంద్రబాబునాయుడు అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మల్లారెడ్డి, యాగంటిపల్లె దస్తగిరి, కటికవానికుంట బాలరాజు, ఖాదర్ తదితర టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

### రాజకీయ చాణక్యుడు సీఎం చంద్రబాబునాయుడు


చంద్రబాబుకు పూలబొకే ఇస్తున్న గడ్డం రామక్రిష్ణారెడ్డి

**కోవెలకుంట్ల :** రాజకీయ చాణక్యుడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అని టీడీపీ రాష్ట కార్యదర్శి గడ్డం రామక్రిష్ణరెడ్డి అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసి నేటికి 30సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా సీఎంకు గడ్డం రామక్రిష్ణరెడ్డి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

**కొలిమిగుండ్ల:** దేశ రాజకీయాల్లో పరిపాలనా పరంగా అపార అనుభవం కలిగిన వ్యక్తి ముఖ్యమంత్రి చంద్రబాబు అని మండల టీడీపీ అధ్యక్షుడు మూలే రామేశ్వర రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం చంద్రబాబు ముఖ్యమంత్రి మొదటిసారి సీఎం పదవి చేపట్టి 30ఏళ్లు అయిన సందర్భంగా మూలే రామేశ్వరరెడ్డితో పాటు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నంద్యాల రామేశ్వరరెడ్డి, నియోజకవర్గ సమన్వయ కర్త వీఆర్ లక్ష్మీరెడ్డి చంద్రబాబుకు అభినందనలు తెలిపారు. వ్యవసాయం, పారిశ్రామికం, ఐటీ ఇలా ఏరంగమైనా చంద్రబాబు తనదైన శైలిలో అభివృద్ధి పథంలో నడపగలరని వారు అన్నారు.